# నరైన్ ఆల్‌రౌండ్ షో.. చెన్నై ఖాతాలో వరుసగా ఐదో ఓటమి



ఐపీఎల్ 18వ సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ భారీ విజయం సాధించింది. చెపాక్ మైదానంలో చెన్నై సూపర్ కింగ్స్(Chennai Super Kings)ను చిత్తుగా ఓడించింది. బంతితో చెలరేగిన సునీల్ నరైన్(44, 3-13) ఆపై సిక్సర్లతో విరుచుకుపడగా.. ఓపెనర్ క్వింటన్ డికాక్(23) ధాటిగా ఆడాడు. కెప్టెన్ అజింక్య రహానే (20నాటౌట్), రింకూ సింగ్(15 నాటౌట్)లు దూకుడుగా ఆడి 8 వికెట్ల తేడాతో అద్భుత విజయాన్ని అందించారు. టాపార్డర్ జోరుతో డిఫెండింగ్ ఛాంపియన్ 10.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని అందుకుంది. ఈ ఎడిషన్‌లో వరుసగా ఐదో మ్యాచ్‌లోనూ సీఎస్కే గెలుపు తలుపు తట్టలేకపోయింది. ఐదుసార్లు ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్‌కు 18వ సీజన్ ఏమాత్రం కలిసి రావడం లేదు. బ్యాటింగ్‌లో సమిష్టి వైఫల్యం ఆ జట్టును వెంటాడుతోంది. ఫలితంగా ప్రతి మ్యాచ్‌లో భారీ మూల్యం చెల్లించుకుంటోంది సీఎస్కే. శుక్రవారం చెపాక్‌లో విజయగర్జనతో అభిమానులను అలరించాలనుకున్న ధోనీ బృందానికి మళ్లీ నిరాశే మిగిలింది. 104 పరుగులస్వల్ప లక్ష్యాన్ని కోల్‌కతా ఆడుతూపాడుతూ ఛేదించింది.


నిజామాబాద్
శనివారం
12.04.2025

సంపుటి : 15 సంచిక: 213
పేజీలు: 8 వెల: రూ.5

ఎడిటర్ : సిరిగాద ప్రసాద్

చట్టం
సంపూర్ణ స్వతంత్ర దినపత్రిక


## అమెరికాపై తగ్గేదేలే

- యూఎస్ ప్రొడక్ట్స్ పై టారిఫ్ ను125 శాతానికి పెంచిన చైనా
- ట్రంప్ బెదిరింపులను లెక్కచేయని డ్రాగన్ దేశం



**చట్టం, బీజింగ్:** అమెరికా, చైనా మధ్య వాణిజ్యపరమైన ఉద్రిక్తతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరింపులను డ్రాగన్ ఏమాత్రం ఖాతరు చేయడం లేదు. చైనా ఉత్పత్తులపై టారిఫ్‌లను యూఎస్ 145 శాతానికి పెంచితే.. డ్రాగన్ నుంచి అదే రియాక్షన్ వచ్చింది. అమెరికా ఉత్పత్తులపై సుంకాలను చైనా 125 శాతానికి పెంచింది. చైనాపై విధించిన టారిఫ్ ను మొత్తంగా లెక్కిస్తే 145శాతంగా ఉంటాయని గురువారం వైట్ హౌస్ నుంచి ఉత్తర్వులు వెలువడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాము విధించిన 84 శాతం టారిఫ్ ను 125 శాతానికి పెంచుతూ శుక్రవారం చైనా ప్రకటించింది. శనివారం నుంచి ఇవి అమల్లోకి వస్తాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దీనిని ఒక నంబర్ గేమ్‌గా అభివర్ణించిన మంత్రిత్వ శాఖ.. ఆర్థికంగా ఎలాంటి ప్రభావం ఉండదని కామెంట్ చేసింది. ఈ తతంగమంతా ఆచరణాత్మక ప్రాముఖ్యత లేనిదని, దీర్ఘకాలంలో రెండు దేశాలపైనా ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని చెప్పింది. చైనా వస్తువులపై విధించిన పరస్పర టారిఫ్ లను తొలగించే దిశగా అమెరికా నిర్ణయం తీసుకోవాలని కోరింది. ఇక నుంచి యూఎస్ వేసే టారిఫ్‌లను తాము పట్టించుకోబోమని స్పష్టం చేసింది. దీనిపై బీజింగ్ ప్రపంచ వాణిజ్య సంస్థలో దావా వేయనున్నట్లు స్థానిక మీడియా వెల్లడించింది. అమెరికా విధించిన టారిఫ్ లపై చైనా ప్రజల్లో ఆందోళనలు నెలకొన్నాయి. అమెరికాకు తమ ఉత్పత్తులను ఎగుమతి చేసే కంపెనీలు ఉద్యోగులకు లేఆఫ్‌లు ప్రకటిస్తున్నాయని సోషల్ మీడియాలో పోస్టులు వెల్లువెత్తుతున్నాయి.

## అన్నాడీఎంకేతో బీజేపీ పొత్తు

- తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం
- అసెంబ్లీ ఎన్నికల్లో ఏఐడీఎంకేతో కలిసే పోటీ చేస్తాం
- ప్రకటించిన కేంద్రహోంమంత్రి అమిత్ షా



**చట్టం, చెన్నై:** తమిళనాడులో పొలిటిక్స్ లో కీలక పరిణామం చోటుచేసుకుంది. అన్నాడీఎంకే, బీజేపీ మధ్య మరోసారి పొత్తు కుదిరింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు వచ్చే ఏడాది జరగనున్న నేపథ్యంలో ఈ రెండు పార్టీల పొత్తుపై అమిత్ షా ప్రకటన చేశారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకేతో కలిసి పోటీ చేస్తామని వెల్లడించారు. తమిళనాడు పర్యటనలో ఉన్న = అమిత్ షా.. అన్నాడీఎంకే చీఫ్, మాజీ సీఎం పళనిస్వామి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైతో కలిసి శుక్రవారం చెన్నైలో మీడియా సమావేశంలో మాట్లాడారు. పళనిస్వామి సారథ్యంలోనే ఎన్నికలకు వెళ్తామని ప్రకటించారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ రెండు పార్టీలు కలిసి పోటీ చేసిన విషయం తెలిసిందే. ఆ ఎన్నికల్లో బీజేపీ నాలుగు స్థానాలు గెలుచుకుంది. అయితే, 2023 సెప్టెంబర్‌లో బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ నుంచి అన్నాడీఎంకే తప్పుకుంది. అప్పటి రాజకీయ పరిణామాల నేపథ్యంలో పలు అంశాలపై ఇరు పార్టీల నేతల మధ్య విభేదాలు తారాస్థాయికి కొనసాగడంతో ఎన్డీఏ, బీజేపీతో సంబంధాలను అన్నాడీఎంకే తెంచుకుంది. తాజాగా వచ్చే ఎన్నికల్లో ఇరు పార్టీలూ కలిసిపోటీ చేసేందుకు సిద్ధమయ్యాయి. అవసరమైతే.. కనీస ఉమ్మడి కార్యచరణ ప్రణాళిక రూపొందిస్తామని అమిత్ షా తెలిపారు. 1998లో నాటి సీఎం జయలలిత నేతృత్వంలో బీజేపీ, అన్నాడీఎంకే కూటమిగా ఏర్పాటైనప్పుడు లోక్‌సభ ఎన్నికల్లో భారీ విజయం సాధించామని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఈ పొత్తు కోసం అన్నాడీఎంకే ఎలాంటి షరతులు, డిమాండ్లు పెట్టలేదని అమిత్ షా తెలిపారు. ఆ పార్టీ అంతర్గత వ్యవహారాల్లో తమ పార్టీ జోక్యం చేసుకోబోదన్నారు. ఈ పొత్తు ఎన్డీఏకు, అన్నాడీఎంకేకు మేలు చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. సీట్ల కేటాయింపు, తదితర అంశాలను తర్వాత నిర్ణయిస్తామన్నారు. తమిళనాడులో డీఎంకే అసలైన సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే సనాతన ధర్మం, త్రిభాషా విధానం వంటి అంశాలను తెరపైకి తీసుకొస్తోందని అమిత్ షా విమర్శించారు.

# ప్రతిపక్ష పార్టీలది అధికార దాహం



- కుటుంబ ప్రయోజనాలే వారికి ముఖ్యం
- ప్రతి ఒక్క పౌరుడి అభివృద్ధే ఎన్డీఏ కూటమి నేతల లక్ష్యం
- పూలే దంపతులను ఆదర్శంగా తీసుకొని మహిళల విద్య, అభివృద్ధికి కృషి చేస్తున్నాం
- ప్రధాని నరేంద్ర మోదీ కామెంట్స్
- వారణాసి అత్యాచార ఘటనపై ప్రధాని ఆరా
- కలెక్టర్, పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్న మోదీ
- నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశం

**చట్టం, వారణాసి:** ప్రతిపక్ష పార్టీలు అధికార దాహంతో కుటుంబ ప్రయోజనాలపై మాత్రమే ఫోకస్ పెడుతున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. కానీ కేంద్రంలోని బీజేపీ సర్కారు ఎటువంటి పదవీ కాంక్ష లేకుండా సమ్మిళిత అభివృద్ధే లక్ష్యంగా ముందుకుసాగుతోందన్నారు. ఎన్డీఏ కూటమి నేతలంతా ప్రతి ఒక్క పౌరుడి అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. పూలే దంపతులను ఆదర్శంగా తీసుకొని తాము మహిళల విద్య, అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. శుక్రవారం ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో రూ.3,880 కోట్ల విలువైన 44 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన ప్రధాని అక్కడి బహిరంగ సభలో మాట్లాడారు. ప్రతిపక్షాలు 'పరివార్ కా సాథ్ పరివార్ కా వికాస్' అనే విధానాన్ని అనుసరిస్తాయని ప్రధాని పేర్కొన్నారు. కానీ దానికి విరుద్ధంగా తామెప్పుడూ 'సబ్‌కా సాథ్..సబ్‌కా వికాస్' నినాదంతో ముందుకువెళ్తామన్నారు. ప్రస్తుతం ప్రారంభించిన ప్రాజెక్టుల్లో కూడా గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేశామన్నారు. వాటిలో 130 తాగునీటి ప్రాజెక్టులు, నాలుగు గ్రామీణ రోడ్లు, 100 కొత్త అంగన్‌వాడీ కేంద్రాలు, 356 లైబ్రరీలు, పాలిటెక్నిక్ కాలేజీ, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఉన్నాయని ప్రధాని తెలిపారు. గతంలో పూర్వాంచల్‌లో ఆరోగ్య సౌకర్యాలు తక్కువగా ఉండేవని, కానీ నేడు కాశీ పూర్వాంచల్‌కు ఆరోగ్య రాజధానిగా మారుతోందని ప్రధాని అన్నారు. భారత్ అభివృద్ధి, వారసత్వం అనే రెండింటితో ముందుకువెళ్తోందని పేర్కొన్నారు. 2036లో నిర్వహించనున్న ఒలింపిక్స్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వాలని అనుకుంటుందని.. అందుకు అనుమతి తీసుకోవడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. తన సొంత నియోజకవర్గమైన కాశీ ఎప్పటికీ తనదేనని.. తాను కాశీకి చెందినవాడినని మోదీ పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా 70 ఏళ్లు దాటిన ముగ్గురు లబ్ధిదారులకు ఆయుష్మాన్ కార్డులను ప్రధాని అందజేశారు.

**సీరియస్ యాక్షన్ తీసుకోండి..**

ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసిలో 6 రోజుల్లో 23 మంది వ్యక్తులు.. 19 ఏళ్ల యువతిపై అత్యాచారానికి పాల్పడిన దారుణ ఘటన ఇటీవల వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ప్రధాని మోదీ దృష్టికి ఈ విషయం చేరడంతో ఆయన ఆరా తీశారు. వారణాసి కలెక్టర్, పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. శుక్రవారం మోదీ వారణాసిలో పర్యటించారు. ఉదయం అక్కడ ల్యాండ్ కాగానే ఇటీవల జరిగిన అత్యాచార ఘటన గురించి జిల్లా మేజిస్ట్రేట్, పోలీస్ కమిషనర్, డివిజనల్ కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా చూసుకోవాలని ప్రధాని మోదీ ఆదేశాలు ఇచ్చారు.

## హెచ్ సీయూ భూముల ఇష్యూలో మొదటి ముద్దాయి కాంగ్రెస్.. రెండో ముద్దాయి బీఆర్ఎస్

- ఆరోపణలు చేయడం కాదు.. దమ్ముంటే బీజేపీ ఎంపీ పేరును కేటీఆర్ బయటపెట్టాలి
- బీజేపీ నాయకులపై బురదజల్లే ప్రయత్నాలను బీఆర్ఎస్ నేతలు మానుకోవాలి
- సీఎం రేవంత్ పై కాంగ్రెస్ హైకమాండ్ కు నమ్మకం లేదు
- మంత్రులతో ఆయనకు సఖ్యత లేదు
- అధిష్ఠానం దూతలు సెక్రటేరియట్ లో సమీక్షలు చేస్తున్నరు
- బీజేపీ ఎంపీ రఘునందన్ రావు హాట్ కామెంట్స్

**చట్టం, మెదక్ / సిద్దిపేట:** కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల తీరుపై మెదక్ ఎంపీ రఘునందన్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. హెచ్ సీయూ భూముల ఇష్యూలో మొదటి ముద్దాయి కాంగ్రెస్ పార్టీ అయితే.. రెండో ముద్దాయి బీఆర్ఎస్ పార్టీ అని ఆయన విమర్శించారు. శుక్రవారం మెదక్, సిద్దిపేట పట్టణాల్లో బీజేపీ టీచర్స్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలు మల్క కొమరయ్య, అంజిరెడ్డిల ఆత్మీయ సమ్మేళనం, అభినందన సభలకు రఘునందన్ రావు చీఫ్ గెస్టుగా హాజరై మాట్లాడారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు సెంట్రల్ యూనివర్సిటీ భూములను దొడ్డి దారిన అన్యాక్రాంతం చేసిన బీఆర్ఎస్ నేతలు.. ఇప్పుడు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని మండిపడ్డారు. హెచ్ సీ యూ భూముల విషయంలో బీజేపీ ఎంపీకి ప్రమేయం ఉందని కేటీఆర్ ఆరోపణలు చేస్తే సరిపోదని.. పేరు, ఆధారాలు బయటపెట్టాలన్నారు. బీజేపీ నాయకులపై బురద జల్లే ప్రయత్నాలను బీఆర్ఎస్ నాయకులు మానుకోవాలన్నారు. గతంలో కాంగ్రెస్ జెండా పై గెలిచిన నాయకులు గులాబీ పార్టీలో చేరారని.. నేడు గులాబీ జెండా పై గెలిచిన నాయకులు కాంగ్రెస్ లో చేరేందుకు ఉత్సాహం చూపుతున్నారని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలది విడదీయరాని బంధమన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన.. 15 నెలల కాంగ్రెస్ పాలన చూసిన ప్రజలు రాష్ట్రంలో బీజేపీకి అధికారం కట్టబెట్టేందుకు సిద్ధమయ్యారని వెల్లడించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయే ఇందుకు నిదర్శనమే అన్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల మొదలు పార్లమెంట్ ఎన్నికల వరకు ఎగురబోయేదీ కాషాయ జెండానే అని రఘునందన్ రావు ధీమా వ్యక్తం చేశారు. సిద్దిపేట గడ్డ మీద కాషాయ జెండా ఎగరడం ఖాయమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను ఇద్దరు ఎమ్మెల్సీలు, ఎంపీ త్రిమూర్తులు మాదిరి అండగా నిలిచి గెలిపించుకుంటామని కార్యకర్తలకు భరోసా నిచ్చారు.

**కాంగ్రెస్ పార్టీ మునిగిపోయే నావ..**

రాష్ట్రంలోని బీజేపీని అడుగు పెట్టనివ్వబోమని సీఎం రేవంత్ రెడ్డి ప్రగల్భాలు పలుకుతున్నాడని రఘునందన్ రావు మండిపడ్డారు. రేవంత్ రెడ్డి సొంత జిల్లాలో ఎంపీ, సీఎం రేవంత్ రెడ్డి ఇదివరకు ప్రాతినిధ్యం వహించిన మల్కాజ్ గిరి ఎంపీ స్థానం, లోక్ సభ ఎన్నికల్లో ఆయన ఇన్ చార్జిగా ఉన్న ఎంపీ స్థానం, అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డిలో గెలిచింది కాషాయ జెండానేనని రఘునందన్ రావు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మునిగిపోయే నావ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి మంత్రుల మధ్య సఖ్యత లేదు.. అధిష్ఠానానికి సీఎంపై నమ్మకం లేదన్నారు. అధిష్ఠానం దూతలు సెక్రటేరియట్ లో సమీక్షలు నిర్వహించే పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయని రఘునందన్ రావు విమర్శించారు.



## కేటీఆర్ కు దమ్ముంటే బీజేపీ ఎంపీ ఎవరో చెప్పాలి

- కంచ గచ్చిబౌలి భూముల ఇష్యూలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసే బీజేపీపై ఆరోపణలు
- అవినీతి జరిగిందని చెబుతున్న కేటీఆర్.. పేర్లు, ఆధారాలు ఎందుకు బయటపెట్టట్లేదు?
- రేవంత్ సర్కారు ఏడాదిన్నర పాలన అంతా
- పుష్ప.. హైడ్రా.. మూసీ చుట్టే తిరిగింది
- ఇప్పుడు హెచ్ సీయూ భూములపై పడ్డారు
- హామీల అమలును కాంగ్రెస్ ప్రభుత్వం పక్కనపెట్టింది
- బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ హాట్ కామెంట్స్

**చట్టం, హైదరాబాద్:** కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలపై నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ కౌంటర్ విసిరారు. కేటీఆర్‌కు దమ్ముంటే ఆ బీజేపీ ఎంపీ ఎవరో పేరు చెప్పాలని డిమాండ్ చేశారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్షంలో ఉండి అవినీతికి సంబంధించిన విషయాలు తెలిసి కూడా పేర్లు ఎందుకు బయటపెట్టడం లేదని ప్రశ్నించారు. శుక్రవారం నాంపల్లిలోని బీజేపీ స్టేట్ ఆఫీస్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తప్పులన్నీ కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి చేసి ఆరోపణలు మాత్రం బీజేపీపై వేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. ఐసీఐసీఐ నుంచి రుణాలు తీసుకుంటే ముందు ఆ బ్యాంక్‌పై విచారణ జరగాలన్నారు. ఇదివరకే హెచ్‌సీయూకు ఇచ్చిన భూములపై అప్పు ఎలా తెస్తారని నిలదీశారు. ఈ విషయంలో కచ్చితంగా విచారణ జరగాలన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ భూములు యూనివర్సిటీ పేరున చేస్తే ఈ అంశం ముగిసిపోతుందన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి కేసీఆర్ ఆ పని చేయలేదని, హెచ్‌సీయూ భూములపై కేటీఆర్, కవితకు



మాట్లాడే నైతిక అర్హత లేదని అర్వింద్ మండిపడ్డారు.

**అసమర్థ, అవినీతి పాలన..**

తెలంగాణలో అసమర్థ, అవినీతి, అసత్య ప్రభుత్వం నడుస్తోందని.. ఆర్థిక క్రమశిక్షణ లేని జీరో పరిపాలన సాగుతోందని ధర్మపురి అర్వింద్ విమర్శించారు. ఏడాదిన్నర పాలనలో పుష్ప, హైడ్రా, మూసీ, హెచ్‌సీయూ మీద పడ్డారు తప్పితే ఇచ్చిన హామీలను అమలు చేయలేదని మండిపడ్డారు. 'ఇందిరమ్మ ఇళ్లు, యువ వికాసం, విద్యా భరోసా కార్డు, చేయూత, ఆరోగ్యశ్రీ, లక్ష రూపాయలు, తులం బంగారం.. ఇలా ఎన్నికల వేళ ఇచ్చిన హామీలన్నీ విస్మరించారు. ఒక్క రోడ్డు వేయలేదు.. ఒక తూము కట్టలేదు. సీఎం రేవంత్ రెడ్డి గ్రాఫ్ పడిపోతోంది. మాజీ సీఎం కేసీఆర్ పక్కన ఉన్న దొంగలే రేవంత్ రెడ్డి పక్కనా ఉన్నారు. రేవంత్ రెడ్డిని కేసీఆర్ జైలులో వేస్తే.. రేవంత్ కనీసం ప్రయత్నం కూడా చేయడం లేదు. ప్రతిపక్షం ఫామ్‌హౌస్‌లో పడుకుంది. ప్రతిపక్ష పదవి ఎందుకు తీసుకున్నారు? కేసీఆర్ వ్యవస్థను విధ్వంసం చేసి దోచుకు తిన్నారు. ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి భయపెట్టిస్తున్నారు.. బుల్డోజర్లు పంపిస్తున్నారు. బీజేపీ నేతలను తెలంగాణలో కాళ్లు పెట్టనివ్వనని రేవంత్ రెడ్డి అహ్మదాబాద్‌లో అన్నారు.

## బీఆర్ఎస్ రజతోత్సవ సభకు అనుమతిపై ఈ నెల 17లోగా నిర్ణయం తీసుకోండి

- రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు
- కౌంటర్ దాఖలు చేయాలన్న ఉన్నత న్యాయస్థానం
- వచ్చే గురువారానికి విచారణ వాయిదా

**చట్టం, హైదరాబాద్:** ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో ఆ పార్టీ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీనిపై శుక్రవారం విచారణ చేపట్టిన న్యాయస్థానం ఈ నెల 17కి వాయిదా వేసింది. సభకు అనుమతిచ్చేలా పోలీసులను ఆదేశించాలంటూ బీఆర్ఎస్ నేతలు పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ నెల 27న ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా దీన్ని ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ తరపు న్యాయవాది పేర్కొన్నారు. హోంశాఖ ముఖ్య కార్యదర్శి, వరంగల్ సీపీ, కాజీపేట ఏసీపీని బీఆర్ఎస్ ప్రతివాదులుగా చేర్చింది. దీంతో ప్రతివాదులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయడానికి హోంశాఖ తరపు న్యాయవాది సమయం కోరారు. ఈ నెల 21 వరకు గడువు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సభకు ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుంది కదా అని హైకోర్టు ప్రశ్నించింది. ఈ నెల 17 నాటికి కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది. బీఆర్ఎస్ ఏర్పాటై 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 27న హనుమకొండలోని ఎల్కతుర్తిలో రజతోత్సవ సభకు ఆ పార్టీ ఏర్పాట్లు చేస్తోంది. పోలీసులు అనుమతి నిరాకరించడంతో బీఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు.. సభ అనుమతిపై వారం రోజుల్లో తేల్చాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.



## కేంద్ర నిధులతోనే రాష్ట్రాభివృద్ధి

- తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం
- రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా మన అభ్యర్థులను గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉండాలి
- కార్యకర్తలకు పిలుపునిచ్చిన టీచర్స్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య
- మెదక్, సిద్దిపేట జిల్లాలో ఆత్మీయ సమ్మేళనాలకు హాజరు
- మెదక్ పట్టణంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బైక్ ర్యాలీ
- శివాజీ మహరాజ్, జ్యోతిబా పూలే విగ్రహాల వద్ద నివాళులర్పించిన కొమరయ్య

**చట్టం, మెదక్ / సిద్దిపేట:** కేంద్ర నిధులతో రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతోందని కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ బీజేపీ టీచర్స్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య అన్నారు. తనను ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించిన తపస్ నాయకులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ నుంచి టీచర్స్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలుగా ఎన్నికైన మల్క కొమరయ్య, చిన్నమైల్ అంజిరెడ్డికి మెదక్, సిద్దిపేట పట్టణాల్లో ఆత్మీయ సన్మాన సభ జరిగింది. ఈ సభలకు బీజేపీ ఎంపీ రఘునందన్ రావు చీఫ్ గెస్టుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్క కొమరయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న పనులను గ్రామస్థాయిలోని జనాల వరకు చేర్చాల్సిన బాధ్యత కార్యకర్తలేదన్నారు. ప్రపంచంలోని పెద్ద పెద్ద కంపెనీల్లో భారతదేశానికి చెందిన వారే ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీజేపీ అభ్యర్థులు గెలిపించుకునేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని మల్క కొమరయ్య ధీమా వ్యక్తం చేశారు. టీచర్ల సమస్యల కోసం కృషి చేస్తానని ఆయన తెలిపారు. భవిష్యత్ తరాలకు మంచి విద్యను అందించేందుకు కష్టపడుతానన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. బీజేపీని చూస్తే కాంగ్రెస్ కు వణుకుపుడుతోందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించే బాధ్యత మాపై ఉందన్నారు. అంతకుముందు మెదక్ పట్టణంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు నిర్వహించిన బైక్ ర్యాలీలో మల్క కొమరయ్య, అంజిరెడ్డి పాల్గొన్నారు. మెదక్ ఎంపీ రఘునందన్ రావుతో కలిసి మెదక్ పట్టణంలోని శివాజీ మహరాజ్, జ్యోతిబా పూలే విగ్రహాలకు మల్క కొమరయ్య, అంజిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తపస్ మెదక్ జిల్లా నేతలతో భేటీ తపస్ మెదక్ జిల్లా నాయకులతో టీచర్స్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య భేటీ అయ్యారు. మోడల్ స్కూల్స్, గురుకుల, కేజీబీవీ టీచర్ల సమస్యలను వివరిస్తూ వారు వినతి పత్రం అందజేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ కొమరయ్య హామీనిచ్చారు.



చట్టం
సంపూర్ణ స్వతంత్ర దినపత్రిక
CHATTAM NEWS
నిజామాబాద్
శనివారం
12.04.2025


# దోపిడీలకు పాల్పడుతున్న పార్థీ గ్యాంగ్ అరెస్ట్...



▶ **జిల్లా ఎస్పీ సీరియస్..**

**చట్టం కామారెడ్డి ప్రతినిధి :** హైవే పై పార్క్ చేసిన వాహనాలే టార్గెట్గా మహారాష్ట్ర పార్థీ గ్యాంగ్ చెలరేగిపోయింది. మారణాయుధాలతో బెదిరించి అందినకాడికి దోచుకుంది. పక్షం రోజుల్లో రెండు చోట్ల దారి దోపిడీకి పాల్పడింది. దీంతో పోలీస్ శాఖ సీరియస్ గా తీసుకుని ముఠాను పట్టుకుంది. కామారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రాజేష్ చంద్ర వివరాలు వెల్లడించారు. మహారాష్ట్ర పార్థీ ముఠా సభ్యులు హైవేలపై డేరాలు వేసుకుని నివసిస్తున్నట్లు నమ్మించేవారు. పూసలు, మ్యాట్స్ అమ్మినట్లు నటించి.. హైవేపై పక్కా నిఘా వేసి చీకటి పడగానే మారణాయుధాలతో సంచరిస్తూ.. పార్కింగ్ చేసిన వాహనాలను టార్గెట్ చేసి దోపిడీలకు పాల్పడ్డారు. జిల్లాలో వరుస దోపిడీ కేసులు నమోదు కాగా ఎస్పీ రాజేష్ చంద్ర ఈ కేసులను సీరియస్ గా తీసుకున్నారు. గత నెలలో టేక్రియాల్ బైపాస్ వద్ద జాతీయ రహదారిపై పార్కింగ్ చేసిన కారులో ఉన్న వాళ్లను మారణాయుధాలతో బెదిరించి ల్యాప్ టాప్ ఎత్తుకెళ్లారు. ఈ నెలలో సదాశివనగర్ మండలం పద్మాజీవాడి ఎక్స్ రోడ్ వద్ద లారీ డ్రైవర్లు భోజనం చేస్తుండగా.. వారిని బెదిరించి సొత్తు ఎత్తుకెళ్లారు. పక్షం రోజుల్లో రెండు ఘటనలు జరగడంతో పోలీసులు అలర్ట్ అయ్యి ముఠాను పట్టుకున్నారు.

**పంక్చర్ షాప్ ఓనర్ ఇచ్చిన క్లూతో...**

దారి దోపిడీ ఘటనలకు సంబంధించి ఓ పంక్చర్ షాప్ యజమాని ఇచ్చిన క్లూతో పోలీసులు ఆరు టీంలుగా ఏర్పడి విచారణ జరిపారు. నాలుగైదేళ్లుగా ఈ మహారాష్ట్ర పార్థీ గ్యాంగ్ దారి దోపిడీలకు తెగబడుతున్నట్టుగా గుర్తించారు. మెదక్ జిల్లా చేగుంట వద్ద డేరా వేసుకుని నివసిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు పక్కా ప్లాన్ తో ముఠా సభ్యులను పట్టుకున్నారు.ఏడుగురి నీ అరెస్ట్ ఎస్పీ రాజేష్ చంద్ర దారి దోపిడీలకు పాల్పడుతున్న మహారాష్ట్రకు చెందిన పార్థీ గ్యాంగ్లోని 11 మంది సభ్యుల్లో ఏడుగురిని అరెస్ట్ చేశామని ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. వీరి నుంచి రెండు మొబైల్స్, ఒక ల్యాప్ టాప్, 4 కత్తులు, 2 కర్రలు, రాళ్లు, టార్చ్ లైట్స్ స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. మహారాష్ట్ర వాద్రా జిల్లాకు చెందిన నిందితులు.. కులి కిషన్ పవార్, జాకి గుజ్జు భోస్లే, పవార్ హరీష్, అనురాగ్ రత్నప్ప భోస్లే, అంచనా, హౌరాహ్ పవార్, చుడిని అరెస్ట్ చేసి రిమాండుకు తరలించినట్లు పేర్కొన్నారు. మిగతా నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఏ ఎస్పి చైతన్య రెడ్డి, సిఐలు రామన్ ,సంతోష్, ఎస్సై రంజిత్, సి సి ఎస్ ఎస్ ఐ ఉస్మాన్ , పోలీస్ సిబ్బంది గణపతి తదితరులు ఉన్నారు.

## కాకతీయ పబ్లిక్ స్కూల్ లో వాక్ఇన్ ఇంటర్వ్యూ




**చట్టం నిజామాబాద్ :** నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రగతి నగర్ లో గల కాకతీయ పబ్లిక్ స్కూల్ ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి వాక్ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు కాకతీయ విద్యాలయ యాజమాన్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. IX మరియు X తరగతులకు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు (E/M) మొదటి భాష తెలుగు, మొదటి భాష హిందీ, భౌతిక శాస్త్రం బోధించేందుకు 3 పోస్టులు ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. నెలసరి జీతం రూ.20,000 నుండి 35,000 వరకు ఉంటుందని తెలిపారు. అదేవిధంగా ఇంగ్లీష్, గణితం, జీవ శాస్త్రం, సామాజిక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు (E/M) ఇంగ్లీష్, గణితం, సైన్స్, సామాజిక బోధించేందుకు గాను 3 పోస్టులు ఖాళీలు ఉన్నాయని రూ. 15,000 నుండి 25,000 ఉంటుందని తెలిపారు. క్యాంపస్ ఇంచార్జ్లు (E/M) ఇంగ్లీష్ మీడియంలో ఏదైనా డిగ్రీ అర్హత కల్గిన అభ్యర్థులకు 2 పోస్టులు ఖాళీ ఉండగా రూ.15,000 నుండి 25,000 ఇవ్వనున్నట్లు తెలిపారు. P.E.Tలు B.P.Ed, UGD Pet లుగా 2 పోస్టులు ఖాళీలు ఉండగా రూ.15,000 నుండి 25,000 ఉంటుందని తెలిపారు. కంప్యూటర్ ఆపరేటర్ (D.T.P) హిందీ, తెలుగు, ఇంగ్లీష్ టైపింగ్ తప్పనిసరి కాగ 1 పోస్ట్ రూ. 15,000 నుండి 20,000. హాస్టల్ వార్డెన్లు ఏదైనా డిగ్రీ 2 పోస్టులు రూ.12,000 నుండి 15,000. ఇంటర్వ్యూ తేదీ: ఏప్రిల్ 12, 2025 శనివారం (మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 5 వరకు) ఉంటుందని అర్హత ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

**గమనిక:** అరగంట ప్రదర్శనకు సిద్ధంగా ఉండండి, జీతాలు డెమో పనితీరుపై ఆధారపడి ఉంటాయి.ప్రతి శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించబడతాయి. పూర్తి వివరాలకు కాకతీయ పబ్లిక్ స్కూల్, (కావేరి క్యాంపస్), ప్రగతి నగర్, నిజామాబాద్, 81870 86111, 93929 34975, 96037 95777 సంప్రదించాలని కోరారు.

## మహాత్మ జ్యోతిరావు పూలెను స్మరించి... జయంతి వేడుకలు నిర్వహించి...



**చట్టం, రామకృష్ణాపూర్:** క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు జ్యోతి రావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక సాధికారత కోసం తెలంగాణలో సమగ్ర కుల గణన చేపట్టడం, బీసీలకు 42 శాతం రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ వంటి అనేక నిర్ణయాలు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న అనేక విషయాలు పూలే స్ఫూర్తితోనే అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘునాథ్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి వొడ్నాల శ్రీనివాస్, మాజీ చైర్ పర్సన్ జంగం కళ, సీనియర్ నాయకులు గాండ్ల సమ్మయ్య, అబ్దుల్ అజీజ్, గోపు రాజం, నాయకులు బత్తుల వేణు, శివ కిరణ్, కుర్మ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డి లో కలకలం..



**చట్టం కామారెడ్డి ప్రతినిధి :** అర్ధరాత్రి ఓ ఇంట్లో నుంచి మంటలు రావడంతో కాలనీవాసులు భయాందోళనకు గురైన ఘటన పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శ్రీరాంనగర్ లో మతిన్ తన కుటుంబంతో ఇంట్లో పైఅంతస్థులో ఉంటున్నాడు. అయితే కింది పోర్షన్లో అర్ధరాత్రి 2 గంటలకు ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆ ఇంట్లో ఎవరూ లేకపోయినప్పటికీ మంటలు రావడం వేగంగా వ్యాప్తి చెందుతుండడంతో కాలనీవాసులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే ఫైర్స్టేషన్ కు సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. పోలీసులకు సైతం సమాచారం అందజేశారు.ఈ ఘటనలో ఎవరికి ప్రాణాపాయం జరుగలేదు. కాగా ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. విద్యుత్ ప్రమాదం జరగలేదని స్థానికులు చెబుతండగా.. అయితే గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి నిప్పంటించారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి

## అంగరంగ వైభవంగా పూజా కార్యక్రమం..



**(చట్టం ప్రతినిధి కామారెడ్డి):** కామారెడ్డి జిల్లా గాంధీనగర్ ప్రాంతంలో వెలసిన శ్రీ రమా సత్య నారాయణ స్వామి దేవాలయంలో శుక్రవారం అంగరంగ వైభవంగా మండల పూజ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా గణపతి పూజ, పుణ్యాహవాచనం, విశేష కలశార్చన, పంచామృతాభిషేకం, శాంతి కల్యాణోత్సవం ఘనంగా చేపట్టారు. ఈ మహోత్సవాన్ని అమ్మవారి ఉపాసకులు రాచర్ల రవిచంద్ర శర్మ గారి ఆధ్వర్యంలో ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ —— "ఈ మహోత్సవం లోక కళ్యాణం కోసం, సర్వజన హితం కోసం నిర్వహించాం. సామూహిక శాంతి, సమృద్ధి కలగాలని స్వామివారిని ప్రార్థించాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పురోహితులు, అర్చకులు, దేవస్థాన కమిటీ సభ్యులు, స్థానిక ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం సాంప్రదాయ సంగీతంతో, మంత్రఘోషలతో మార్మోగిపోగా, భక్తులు పరిశించిపోయారు.

## వార్డులలో జై బాపు జై భీమ్ జై సంవిధాన్



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని 10, 29, 36 వ వార్డులలో శుక్రవారం రోజు జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతథిగా ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి, పాల్గొని ప్రారంభించారు . 10,29,36 వార్డుల లో వాడ వాడకి వెళ్లి కరపత్రాలు పంచి కార్యక్రమాన్ని కొనసాగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన రాజ్యాంగాన్ని కాపాడుకుందాం మనకు అహింస, శాంతి సిద్ధాంతాలను అలవరచిన మహాత్మ గాంధీని స్మరించుకుందాం. రాజ్యాంగాన్ని రచించి ప్రపంచం లో ఎక్కడ లేని విధంగా అందరికి సమాన హక్కులు కల్పించిన రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆలోచనలను కాపాడుకుందాం. అందుకే జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదాలతో ఉద్యమ కార్యాచరణ ఏఐసీసీ అగ్రనాయకత్వం రూపొందించిందన్నారు. 30 రాష్ట్రాలు, ఏడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో 5,97,608 గ్రామాల్లో మరియు 7,933 పట్టణాల్లో నివసిస్తూ భిన్నత్వంలో ఏకత్వంతో కూడిన భారతదేశ నిర్మాణానికి కోటానుకోట్ల సంఖ్యలో దృఢ నిశ్చయంతో జీవితాలను కొనసాగిస్తున్న భారతీయులను ఏకం చేయడానికి పూనుకుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకత్వం తీసుకున్న ఈ నిర్ణయం ప్రకారం గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆలోచన మేరకు తెలంగాణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఆదేశాలతో జిల్లాలో తొలిసారిగా ఆర్మూర్ నియోజకవర్గం ఆర్మూర్ పట్టణంలో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం అని వారు కొనియాడారు. ఈ పాదయాత్రలో భాగంగా వార్డులలోని స్కూల్ సమస్యలు, ఇతర సమస్యలు తెలుసుకొని ప్రభుత్వం నుండి నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఈ కార్యకమంలో ఆర్మూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏఎంసీ చైర్మన్ సాయిబాబా గౌడ్, బీసీ సెల్ అధ్యక్షుడు దొండి రమణ, ఏఎంసీ డైరెక్టర్ శేఖర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు, ఫయామ్, ప్రవీణ్, కొంత మురళి, నాయకులు జిమ్మీ రవి, మారుతీ రెడ్డి, వెంకటరామిరెడ్డి, కొంతం మురళి, థైసిన్, నదీమ్, నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బి ఆర్ ఎస్ రజతోత్సవ సభకు భారీ సంఖ్యలో తరలిరావాలి



**చట్టం, లోకేశ్వరం :** లోకేశ్వరం:మండల కేంద్రంలో బీఆర్ఎస్ రజతోత్సవాల సందర్భంగా ఈ నెల 27న వరంగల్లో నిర్వహించే సభకు నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని బి ఆర్ఎస్ ముధోల్ నియోజకవర్గం సమన్వయ సమితి సభ్యులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ జెడ్పి చైర్మన్ లోలం శ్యాంసుందర్ పిలుపునిచ్చారు శుక్రవారం లోకేశ్వరంలో సమావేశం ఏర్పాటు చేసి ముఖ్య నేతలతో సమావేశంలో ఆయన మాట్లాడుతూ..త్వరలో మరో సమావేశాన్ని నిర్వహించి పార్టీ శ్రేణులను తరలించే విషయాన్ని చర్చిస్తానని, దీనికి సంబంధించిన తేదీని ఒకటి రెండు రోజుల్లో ప్రకటిస్తానని చెప్పారు. లోకేశ్వరం ముధోల్ నియోజకవర్గం నుండి నుంచి వేల మందికి తక్కువ కాకుండా వరంగల్ సభకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో బి ఆర్ఎస్ మాజీ మండల కన్వీనర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్ కరిపే శ్యాంసుందర్, మాజీ ఎంపీపీ సాగర్, లోకేశ్వరం టిఆర్ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు దిగంబర్, బి ఆర్ఎస్ మండల సోషల్ మీడియా కన్వీనర్ బండి ప్రశాంత్, నాయకులు, పాల గంగాధర్, ధర్మోర ప్రకాష్, భోజరెడ్డి, సుధాకర్, నగర్ మాజీ ఉపసర్పంచ్ ముసప, హవర్ భోజన్న, మగ్గిడి రాజు,మాజీ ఎంపీటీసీ బందు, ఎస్టీ సెల్ కన్వీనర్ రాజుర భోజన్న, ఆనందరావు, బాబన్న, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

## సామాజిక తత్వవేత్త మహాత్మ జ్యోతిరావు పూలే

▶ **ఆశయాలను కొనసాగిద్దాం..**

▶ **రాష్ట్ర యువత నాయకులు పడిగే ప్రశాంత్ ముదిరాజ్**



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేట జిల్లా కేంద్రం పాత బస్టాండ్ వద్ద సమాజంలోని కులపరమైన వివక్షను అన్యాయాలను రూపుమాపడానికి తన జీవితాన్ని దార పోసిన మహాత్ముడు మహాత్మ జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా యునైటెడ్ పూలే ఫ్రంట్ రాష్ట్ర యువత నాయకులు పడిగే ప్రశాంత్ ముదిరాజ్ మాట్లాడుతూ... బడుగు బలహీన వర్గాల ప్రజలకు హక్కుల కోసం పోరాడిన మహనీయుడు సామాజిక ఉద్యమకారుడు సామాజిక సమానత్వం మహిళా అభ్యున్నతి ప్రతి ఒక్కరి చదువు వంటి మహత్తర సంస్కరణలకు 175 ఏళ్ల కిందటే బీజం వేసి తన జీవితం మొత్తం పోరాడిన మార్గదర్శి దిక్సూచి ఆదర్శనీయులు వర్ణ వివక్షను రూపుమాపడం కోసం, దళిత బహుజన మహిళ వర్గాల అభ్యున్నతి కోసం పూలే ఆచరించిన కార్యాచరణ మహోన్నతమైనది కుల, లింగ వివక్షకు తావు లేకుండా సమానత్వం, విద్య, హక్కుల పరిరక్షణ ద్వారానే సామాజిక ఆర్థిక సమున్నతికి బాటలు పడతాయన్న వారి ఆలోచన నేటి తరానికి ఎంతో స్ఫూర్తి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం సిద్దిపేట జిల్లా నాయకులు భుక్య బిక్షపతి నాయక్. జిల్లా బి సి నాయకులు రాచకొండ బిక్షపతి, సుదగోని శ్రావణ్ గౌడ్, అప్పల శేఖర్ యాదవ్, పెంబర్తి అనిల్ యాదవ్, రాజు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## సీతారామ ఉమామహేశ్వరుల కళ్యానానికి గోటి తలంబ్రాలు

**చట్టం ప్రతినిధి, సిద్దిపేట (దుబ్బాక) :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో ఈ నెల 22న జరిగే సీతారామ ఉమామహేశ్వరుల కళ్యానానికి గోటి తలంబ్రాలను అందించాలని శ్రీరామకోటి భక్త సమాజం శ్రీకారం చుట్టింది. దీనికి సంబందించిన గోటి తలంబ్రాలు (వడ్లు) ప్యాకెట్లను శుక్రవారం నాడు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వంటేరు యదవరెడ్డి మాట్లాడుతూ శ్రీరామకోటి భక్త సమాజం ధార్మిక సేవా సంస్థ గత 26 సంవత్సరాల నుండి ఎన్నో సామాజిక, ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ భద్రాచలం సీతారాముల కళ్యానానికి ఈ మద్యే 250 కిలోల గోటి తలంబ్రాలు అందించిన ఘనత రామకోటి రామరాజుదే అన్నారు. మూడు సార్లు భద్రాచల కల్యానానికి అందించడం అనేది అభినందనీయమని అన్నారు. అలాగే ఈ నెల 22 వ తేదీన గజ్వేల్ లో జరిగే సీతారామ, ఉమామహేశ్వరుల కళ్యానానికి గత సంవత్సరం గోటి తలంబ్రాలు, ముత్యాల తలంబ్రాలు అందించారు. అదే విధంగా ఈసారి కూడా భక్తులచే ఒలిపించి అందించాలనేది రామకోటి రామరాజు సంకల్పం గొప్పదన్నారు. రామకోటి రామరాజు నిర్విరామ సేవ అమోఘం అన్నారు. సామాజిక సమరసత రాష్ట్ర అధ్యక్షులు ఆకుల నరేష్ బాబు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గోటి తలంబ్రాలను ఒలిపించి తనలో ఉన్న రామభక్తిని ప్రతి ఒక్కరిలో గ్రామ, గ్రామాన రామకోటి రామరాజు మేల్కొల్పాడని అన్నారు. గజ్వేల్ సీతారామ, ఉమామహేశ్వరుల కల్యానానికి గోటి తలంబ్రాలు అందించడం రామకోటి రామరాజుకే సాధ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో మెతుకు నర్సింలు, జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్య పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలి : అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్



**చట్టం నిజామాబాద్ ప్రతినిధి :** నిజామాబాద్ నగరంలోని 9వ డివిజన్ నాగారంలో ఇందూర్ అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్ తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మున్సిపల్ కమిషన్, అధికారులకు పలు సూచనలు చేయడం జరిగింది. నగరంలో డ్రైనేజీ సమస్య కీలకంగా మారిందని డ్రైనేజీ కాలువలు పూడికలు తీయకపోవడంతో చెత్త, నీరు నిల్వ ఉండటం చూసి మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యంపై అసహనం వ్యక్తం చేసారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహించి డివిజన్ లో డ్రైనేజీ కాలువలు పూడికలు తీయాలని, నిత్యం డ్రైనేజీ పూడికలు తీసే విదంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డ్రైనేజీ కొత్త కాలువలు, సీసీ బీటీ రోడ్లు అవసరం ఉన్న చోట నిర్మించాలని ముఖ్యంగా రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కమిషనర్ కి సూచించారు. వేసవి కాలంలో ప్రజలకు మంచినీటి కోరత లేకుండా చూసుకోవాలని అన్నారు అవసరం ఉన్న చోట వాటర్ ట్యాంక్ లు, బోర్స్ వేయాలని సూచించారు. ధన్ పాల్ లక్ష్మిభాయ్ & విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్ట్ ధ్వరా డివిజన్ ప్రజలకు మంచినీటి సౌకర్యం కోసం తన సొంత నిధులతో వేపించిన మంచి నీటి బోర్స్ ను మున్సిపల్ అధికారులను స్వాధీనం చేస్తూ వాటికీ మీటర్స్ ఏర్పాటు చేయాలనీ సూచించారు. డివిజన్ విస్తరిస్తున్న కారణంగా ఎలక్ట్రికల్ స్తంబాలు, వీధి ద్విపాల కోరత ఏర్పడుతుందని దీనికి పరిష్కారంగా స్తంబాలు, వీధి లైట్లు ఏర్పాటు చేయాలనీ సూచించారు. డివిజన్ వాసులకు ఆహ్లాదకరమైన పార్క్, ఓపెన్ జీమ్ తో కూడిన నిర్మాణం చేపట్టాలని సూచించడం జరిగింది. ఇందూర్ అర్బన్ నియోజకవర్గం పరిధిలో ఉన్న అన్ని డివిజన్లో సమస్యలను పరిశీలించడం జరుగుతుందని వాటిని త్వరలో పరిష్కరించేల అధికారులతో కలిసి చర్యలు తీసుకుంటాం అని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ EE మురళి మోహన్ రెడ్డి, అడిషనల్ మున్సిపల్ కమీషనర్ జయకుమార్,AE భూమేష్, బిజెపి మండల అధ్యక్షులు నాగరాజు, స్థానిక మాజీ కార్పొరేషన్ సాయి వర్ధన్, కిరణ్, సుందర్ రాథోడ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## సాధిద్దాం పూలె ఆశయాలను సాధిద్దాం



**చట్టం నిజామాబాద్ ప్రతినిధి :** మహాత్మా జ్యోతి రావ్ పూలె 199వ జయంతి సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో వినాయక నగర్ విగ్రహాల పార్క్ వద్ద నిర్వహించిన జయంతి ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా ఇందూర్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా మహాత్మా పూలె విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతు మహాత్మా జ్యోతి రావ్ పూలె సామజిక తత్త్వవేతగా బడుగు బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయులని కొనియాడారు. మన దేశ ప్రగతి యాత్రలో వెనుకబడటానికి, వందల సంవత్సరాలు విదేశీయుల పాలనలో మ్రగ్గడానికి, మూఢచారాలు ప్రబలడానికి కారణం ప్రజల్లో జ్ఞానం లేకపోవడమే అని గుర్తించి సమాజంలో అందరిని విద్యావంతులను చేయాలనేవిషయంలో శ్రద్ధ వహించకపోవడమేనన్న విషయాన్నీ గ్రహించి జ్యోతిరావు పులే తన జీవితం అంత బడుగు బలహీన వర్గాల ప్రజలకు, స్త్రీలకు విద్య నేర్పించడానికి జీవితాన్ని అంకితం చేసారన్నారు. సత్యశోదక్ సమాజ్ ద్వారా సమాజంలో అసమానతలను, మూఢ నమ్మకాలను రూపుమాపడానికి పోరాటం చేసారన్నారు. జ్ఞానం లేకుంటే గౌరవం లభించదని, శిక్షణ లేకుంటే సమాజంలో సంస్కరణ సాధ్యం కాదని, స్త్రీలను విద్య అందించాలన్న సంకల్పంతో మొదట తన భార్య సావిత్రిభాయ్ విద్య నేర్పిచి పూణే నగరంలో మొదటిసారిగా బాలికల కోసం ఒక పాఠశాలను ప్రారంభించారని తెలియజేసారు. ఆంగ్లప్రభుత్వం పేదప్రజల కొరకు ఉచితంగా చదువు చెప్పించే ఏర్పాటు చేసి, వారి అజ్ఞానాన్ని, పేదరికాన్ని తొలగించి, ప్రజలను సుఖంగా, సంతృప్తిగా జీవించేటట్లు చూసుకోవడం ప్రభుత్వం యొక్క బాధ్యత అని, బ్రిటిష్ ప్రభుత్వం చేస్తున్న తప్పులను ఎత్తి చూపిన మహనీయులు పులే అని అన్నారు. పులే దంపతులు ఇరువురు సమాజంలో అసమానతలు, కుల వ్యవస్థ నిర్ములనకు పోరాటం చేస్తూ బాల్య వివాహలకు వ్యతిరేకంగా, వితంతు గర్భిణీలకు అండగా, అనాధ పిల్లలను అక్కున చేర్చుకున్న మహనీయులు పులే దంపతులు అన్నారు. సమాజం ఎన్ని రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్న, సంఘ బహిష్కరణలు చేసిన చివరికి తండ్రి కూడా ఇంటినుండి వెళ్లగొట్టిన వనవాసనికి రాముని వెంట సీతలా పులే వెంట సావిత్రి భాయ్ భర్త లక్ష్యసాధనలో తోడుండి ఈ దేశానికి మొదటి పంతులమ్మ అయ్యి వారి జీవితాన్ని పూర్తిగా బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి,సమానత్వం కోసం పాటుపడటం జరిగిందన్నారు. నేటి సమాజం, యువత వారి ఆశయ సాధనలో నడవలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా నాయకులు, కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జ్యోతి రావు పూలే జయంతి



**చట్టం, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తుల మహేందర్ యాదవ్ ఆధ్వర్యంలో వేములవాడ పట్టణంలో జ్యోతి రావు పులే 198 జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్ యాదవ్ మాట్లాడుతు అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన వ్యక్తి జ్యోతి రావు పూలె, ఈయన గొప్ప సంఘ సంసకర్త, 1870 లో మొట్టమొదటి మహిళా బాలికల పాఠశాలను ఏర్పాటు చేసి స్త్రీ అభ్యున్నతి కి పాటుపడిన వ్యక్తి,జ్యోతి రావు, జ్యోతిరావు పూలె విగ్రహాన్ని వేములవాడ పట్టణంలో ఏర్పాటు చేయాలనీ ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు జిల్లా అధ్యక్షులు బత్తుల మహేందర్ యాదవ్, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు మొగిలి కరుణాకర్, పట్టణ యువత అధ్యక్షులు బండారి గవాస్కర్, వేములవాడ మండలం అర్బన్ అధ్యక్షులు పార్వతి మహేష్, బోయిన్పల్లి మండల్ అధ్యక్షులు దయ్యాల రాజశేఖర్, చంద్రగిరి సిద్ధార్థ, వాసం మల్లేశం యాదవ్, అనిల్ గౌడ్, రంజిత్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే 198 వ జయంతి వేడుకలు



**చట్టం, భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి :** భద్రాద్రి కొత్తగూడెంలోని అంబేద్కర్ హాస్పిటల్ స్వయం గౌరవ ఉద్యమ వేదిక, పరివర్తన యశోద ఫౌండేషన్ సేవాసమితి, మహాజన మహిళా సమైక్య ల ఆధ్వర్యంలో సామాజిక తత్వవేత్త, స్వయం గౌరవ ప్రతీక మహాత్మ జ్యోతిరావు పూలే 198వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వయం గౌరవ ఉద్యమ వేదిక నాయకులు, ప్రముఖ హేతువాది డాక్టర్ భాను ప్రసాద్ , పరివర్తన యశోద ఫౌండేషన్ సేవా సమితి అధ్యక్షులు కొమ్మ గిరి వెంకటేశ్వర్లు ఎంఎంఎస్ జిల్లా నాయకులు మేకల లత మాట్లాడుతూ....అట్టడుగు వర్గాల అభ్యునతి కోసం నిరంతరం పోరాటం చేసిన పోరాట యోధుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని,మహిళల విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన సంఘసంస్కర్త జ్యోతి రావు పూలే అని కొనియాడారు. సాంఘీక విప్లవకారుడు మహాత్మ పూలేనే అని,బ్రాహ్మణీయతను ప్రతిఘటించిన సాహసి, వేద పురాణాల వాస్తవికతను ప్రశ్నించిన హేతువాది,సమాజంలో కుల హెచ్చుతగ్గులను సమానంగా చెయ్యడానికి నిరంతరం పని చేసిన త్యాగశీలి పూలే అని అన్నారు. సామాజిక వ్యవస్థలో ఉన్న రోగాలను పసిగట్టి అసలైన శాస్త్ర చికిత్స చేసిన సామాజిక న్యాయ వైద్యుడు పూలే అని అన్నారు. మన మంతా పూజించే డా బాబాసాహెబ్ అంబేద్కర్ గురువు మహాత్మా జ్యోతిబా పూలే అని గుర్తు చేశారు. మహాత్మ జ్యోతిరావు పూలే 198వ జయంతి సందర్భంగా మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల చిత్రపటానికి నివాళులు అర్పించడం జరిగిందని అని అన్నారు. మనమంతా మహాత్మా జ్యోతిబా పూలే, జ్యోతిబాపూలే ఆశయాలను కొనసాగించడమే ఆ మహనీయులకు మనం ఇచ్చే ఘన నివాళి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వయం గౌరవ ఉద్యమ వేదిక నాయకులు చిన్న దిలీప్, వై ప్రవీణ్,షాహీన్,పొన్నాల వెంకటరెడ్డి, అలీ, మహాజన మహిళ సమైఖ్య ఎంఎంఎస్ జిల్లా నాయకులు మేకల లత, కొచర్ల కుమారి, కొప్పుల నాగమణి, గద్దల కృష్ణవేణి, బొమ్మన వేణి మంగ,ఎమ్మార్పీఎస్,ఎంఎస్పి జిల్లా సీనియర్ నాయకులు అలవాల పెరియార్ రాజా మాదిగ, కొప్పుల తిరుపతి మాదిగ, యశోద ఫౌండేషన్ సేవాసమితి సభ్యులు రాయల రాము,వెంకటేశం, ఈశ్వర్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## జ్యోతిరావ్ పూలే చేసిన కృషి వెలకట్టలేనిది : కలెక్టర్



**చట్టం మెదక్ ప్రతినిధి :** బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం, మహాత్మ జ్యోతి రావ్ పూలే చేసిన కృషి ఫలితాలే నేటి సమాజం అనుభవిస్తున్న ఫలాలు అని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. శుక్రవారం మెదక్ ధ్యాన్ చాంద్ చౌరస్తాలో ఘనంగా మహాత్మా జ్యోతి రావ్ పూలే 199వ జయంతి వేడుకలు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేష్ ఇతర ప్రజాప్రతినిధులు బీసీ సంఘ నాయకులతో జ్యోతి రావ్ పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. ముందుగా తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు పాటల రూపంలో కళా ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావ్ పూలే 199 జయంతి ఉత్సవాలను జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. బడుగు బలహీన వర్గాలకు విద్యాపరంగా ఉపాధి పరంగా సమగ్ర అభివృద్ధిని అందించేందుకు మహాత్మ జ్యోతిరావ్ పూలే చేసిన కృషి వెలకట్టలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు, ఇతర ప్రజాప్రతినిధులు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బిసి సాధికారిత సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జ్యోతి రావు పూలే జయంతి వేడుకలు



**చట్టం, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతి రావు పూలే 198 జయంతి వేడుకలు బీసీ సాధికారిత సంఘం ఆధ్వర్యంలో వేములవాడ పట్టణంలోని ఉత్తర తెలంగాణ జిల్లాలకు చెందిన బీసీ సాధికారిత సంఘం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా బీసీ నేతలు నివాళులు అర్పించారు. రాజన్న సిరిసిల్లా బీసీ సాధికారిత సంఘం జిల్లా అధ్యక్షులు పొలాస నరేందర్ మాట్లాడుతూ ఉద్యమ కారుడిగా, సంఘ సంస్కర్తగా, అనగదొక్కబడిన హృదయాలలో చిరస్థాయిగా నిలిచిన మహనీయుడు, కుల, మత, వర్గ, వర్ణ విబేధాలు ఉండ కుండా ఉండాలంటే అన్నింటికీ విద్యనే ముఖ్యమని భావించి తన సతీమణి సావిత్రీ బాయి పూలే ని బడికి పంపించారని, పేదవారు విద్యను అభ్యసించుటకు ఉదయం, రాత్రి పూట బడులను స్థాపించారని, అంటరాని తనం రూపు మాపుటకు, అనాధ బాలల పాఠశాలలకు, వితంతుల కొరకు, అనాధ బాలల కోసం, వృద్ధుల కోసం ఎనలేని కృషి చేశారని, ఎన్నో పోరాటాలు చేశారని అన్నారు. జయంతి కార్యక్రమంలో బీసీ సాధికారిత సంఘం నేతలు కొండ కనుకయ్య, లింగంపల్లి దేవయ్య, తూపుకారి సత్తయ్య, ఇల్లందుల వెంకటేష్, సిహెచ్.రామస్వామి గౌడ్, ఉయ్యాల భూమయ్య, ఎట్టము సాయికృష్ణ,మ్యాన రాజేష్ నిమ్మగడ్డ శ్రీనివాస్, ఓన్నారపు దేవయ్య,చెను హేలపతి, ఎం.చందు, ముద్రకోల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయంతో పాటు ప్రాణదానం.. హైకోర్టు న్యాయవాది ఆదర్శం!




**చట్టం కామారెడ్డి ప్రతినిధి :** ఉన్నత న్యాయస్థానంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ, సమాజం పట్ల తమకున్న బాధ్యతను చాటుకున్నారు హైకోర్టు న్యాయవాది సయ్యద్ ఫెరోజ్ అహ్మద్. ఆయన తాజాగా మరోసారి రక్తదానం చేసి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఇది ఆయన చేసిన 21వ రక్తదానం కావడం విశేషం. శుక్రవారం కామారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో లతకు డెలివరీ ఆపరేషన్ నిమిత్తం రక్తం అవసరం కాగా.. ఆయన ముందుకొచ్చి రక్తాన్ని అందించారు.ఈ కార్యక్రమంలో రక్తదాతల సమూహ జిల్లా అధ్యక్షుడు జమీల్ అహ్మద్ ఎడ్ల రాజు. సుంకరి సాయిలు. ఒద్దేం బాలరాజు. రాము, కేబీఎస్ సిబ్బంది పాల్గొన్నారు

## నేడు ముధోల్ లో మల్లయోధుల కుస్తీ పోటీలు



**చట్టం, ముధోల్ :** నిర్మల్ జిల్లా ముధోల్ నియోజకవర్గంలోని ముధోల్ మండల కేంద్రంలో మహాశక్తి మహాదేవుని జటా శంకర ఆలయం వద్ద శనివారం మల్లయోధుల కుస్తీ పోటీలు ఉంటాయని కుస్తీ పోటీలు జరిగేటప్పుడు ఎస్సై ముధోల్ సంజీవ్ కుమార్ నేతృతంలో భారీ పోలీసు బందుబస్తు చేపట్టి ప్రథమ బహుమతిగా గెలిచిన వారికి వెండి కడియంతో పాటు వారితోషకం రెండో బహుమతి కూడా ఉంటుందని దాదాపు ఉదయం నుండి సాయంత్రం వరకు కుస్తీ పోటీల నిర్వహణ కొనసాగుతుందని యధావిధిగా వారి కోసం అన్ని ఏర్పాట్లు ఇప్పటికే చేయడం జరిగిందని ముఖ్యంగా ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం కూడా మల్లయోధుల కుస్తీ పోటీలు నిర్వహించబోతున్నామని ముఖ్యంగా మహారాష్ట్ర మన జిల్లా పక్కనున్న నిజామాబాద్ పరిసర ప్రాంతాల నుండి మల్లయోధులు ఆసక్తిగా కుస్తీ పోటీలను ఆడటానికి భారీ సంఖ్యలో వస్తుంటారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి భక్తులు గ్రామస్తులు సకలంలో హాజరై విజయవంతం చేయాలని అదే విధంగా శుక్రవారం రాత్రి పశు పశునాథ్ ఆలయం వద్ద మహాదేవుని కాటి అంగరంగ వైభవంగా డప్పుల భాజా భజంచిరుల మధ్య కొనసాగుతుందని ముధోల్ గ్రామ వి డి సి చైర్మన్ రోడ్ల రమేష్, పోతన్న యాదవ్, రమేష్, గ్రామస్తులు, విడిసి కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు

## కలెక్టరేట్ లో ఘనంగా మహాత్మ జ్యోతిబా పూలే జయంతి వేడుకలు



**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** మహాత్మ జ్యోతిబా పూలే జయంతి వేడుకలను శుక్రవారం కలెక్టరేట్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అదనపు కలెక్టర్లు, ఇతర జిల్లా అధికారులు జ్యోతి బా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ మాట్లాడుతూ, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు జ్యోతిబా పూలే అని కొనియాడారు. అస్పృశ్యత, అంటరానితనం, కులవివక్షత వంటి సామాజిక రుగ్మతలను నిర్మూలించేందుకు జ్యోతిబా పూలే పోరాటం, చూపిన తెగువ స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆనాటి కాలంలో ఉన్న వివక్షతకు వ్యతిరేకంగా పోరాడి మహిళల అభ్యున్నతికి పాటుపడ్డారని తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ, మహాత్మ జ్యోతిబా పూలే తన భార్య సావిత్రిబాయి పూలే తో కలిసి మహిళల విద్యకు ఆజన్మాంతం కృషి చేశారని తెలిపారు. మహిళా విద్యను ప్రోత్సహించడానికి దేశంలోనే మొట్టమొదటిసారిగా తొలి బాలిక పాఠశాలను ప్రారంభించారన్నారు. జ్యోతిబా పూలే జీవిత చరిత్రను భావితరాలకు తెలియజేసే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. మహనీయుల జయంతి వేడుకలు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం గొప్ప విషయమని తెలిపారు. ప్రతి ఒక్కరూ జ్యోతిబా పూలే ను మార్గదర్శకంగా తీసుకొని, ఆయన ఆశయాలకు కృషి చేయాలనీ కోరారు. జిల్లా కేంద్రంలో జ్యోతిబాపూలే భవనం, విగ్రహం ఏర్పాటు కోసం పలువురు సంఘ నాయకులు అధికారులకు విజ్ఞప్తి చేయగా, జ్యోతిబాపూలే భవన ఏర్పాటు దిశగా ప్రయత్నం చేస్తామని అదనపు కలెక్టర్లు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి శ్రీనివాస్, ఎస్సీ సంక్షేమ అధికారి రాజేశ్వర్ గౌడ్, మైనారిటీ అధికారి మోహన్ సింగ్, సిపిఓ జీవరత్నం, ఎల్డిఎం రామ్ గోపాల్, జిల్లా పరిశ్రమల మేనేజరు నరసింహారెడ్డి, వివిధ కుల సంఘాల నాయకులు నర్సాగౌడ్, భాస్కర్, ప్రభాకర్, మనోజ్, ముడుగు సత్యనారాయణ గౌడ్, ఇతర నాయకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బిచ్కుందలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి ....



**చట్టం బిచ్కుంద:** బడుగు బలహీన వర్గాల ఆదర్శ ఆశ జ్యోతి మహిళల జీవితాల్లో విద్యా ప్రాముఖ్యతను సమాజానికి చాటి చెప్పిన మహనీయుడు మహాత్మ జ్యోతిరావు పూలే యొక్క 199వ జయంతి సందర్భంగా బిచ్కుంద మార్కెట్ కమిటీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గంగాధర్ డెలికేట్ విట్టల్ రెడ్డి పాల్గొని మహాత్మ జ్యోతిరావు పూలే గారి యొక్క చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు .ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు సీమ గంగారాం మాట్లాడుతూ 1827 ఏప్రిల్ 11న మహారాష్ట్రలో జన్మించిన పూలే గారు బాల్యం నుంచి ఆనాటి సాంఘిక దురాచారాలు కట్టుబాట్లు మధ్య వారి జీవితం కొనసాగింది. విద్యాభ్యాసం లోను వివక్షను ఎదుర్కొన్నారు.అయితే ఆంగ్లో స్కాటిష్ అనే క్రైస్తవ మిషనరీ పాఠశాలలో విద్య ప్రారంభించారు. అక్కడే సమానత్వం అనే భావనతో అనేక ఆలోచనలతో పరిపక్వత చెందుతూ చదువు కేవలం ధనికులకు, బ్రాహ్మణులకు మాత్రమే అన్న సమాజ భ్రాంతిని తొలగించాలని ఆశయం అక్కడ మొదలై విద్యను అణగారిన వర్గాల కు అందించాలని మానవతా సంకల్పం ఆయనను కదిలించింది. 1840లో సావిత్రిబాయి పూలేను వివాహమాడి స్త్రీలను విద్యావంతులను చేయడానికి భార్యకు చదువు చెప్పించి ఉపాధ్యాయురాలుగా తీర్చిదిద్ది 1848లో పూణేలో తొలి బాలిక పాఠశాల స్థాపించి విద్య అందరికీ అనే నినాదం కార్యరూపం దాల్చేలా చేసి, ఇది కేవలం విద్యా కేంద్రం కాదు సామాజిక మార్పు కేంద్రం అని సూచించారు. 1873లో "సత్యశోధక సమాజం" స్థాపించి దాని ద్వారా కుల వ్యవస్థను వ్యతిరేకించి శూద్ర అతి సూద్ర వర్గాలకు ఆత్మగౌరవాన్ని నూరిపోసి వివాహ పూజా విధులలో స్వతంత్రమైన ఆలోచనలను కలిగి ముందుకు సాగేలా చేశారు. వివక్షత మనిషిని మానవత్వం నుండి దూరం చేస్తుంది ఒకరి మానవత్వాన్ని చిన్నగా చూస్తే అది సమాజానికి శాపంగా పరిణమిస్తుందని పూలే యొక్క అభిప్రాయం. జ్యోతిరావు పూలే రాసిన "గులాం గిరి" అనే పుస్తకంలో అత్యంత దయనీయంగా బానిసత్వంలో మగ్గుతున్న కులాల పరిస్థితులను దాస్యత్వాన్ని విశదీకరించారు. బానిసత్వాన్ని రూపుమాపడానికి అలాగే విద్య ఆర్థిక రాజకీయ సమానత్వం కోసం పరిష్కార మార్గాలు చూపారు. పూలే తన జీవితాంతం తాత్వికుడుగా సంఘసంస్కర్తగా అట్టడుగు వర్గాల ఆత్మ బంధువుగా పోరాటాలు చేస్తూ సమసమాజ అభివృద్ధికి ఆజన్మాంతం సేవలందించారు .ఆ మహనీయుని యొక్క సేవలను స్మరించుకుంటూ భవిష్యత్తు తరాల వారికి పూ లే యొక్క జీవిత చరిత్ర ఆదర్శప్రాయంగా తీసుకొని నడిచేలా చేయాలి. మున్ముందు మహాత్మ జ్యోతిరావు పూలే యొక్క సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డు ఇవ్వాలి అలాగే రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా అన్నిచోట్ల పూలే యొక్క జయంతి వేడుకలను నిర్వహించేలా ప్రోత్సహించాలి అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నాగనాథ్ పటేల్, సిఐటియు సభ్యుడు సురేష్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాయిని అశోక్ గుండె కల్లూరు మాజీ ఎంపీటీసీ రాజు పటేల్ , మరియు బీసీ ఎస్సీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సాంఘీక సమానత్వ సాధనే మహాత్మా పూలే కు నిజమైన నివాళి

- **జ్యోతిరావ్ పూలే జయంతి సభలో సీఎండీ ఎన్. బలరామ్**



**చట్టం రామగుండం :** మహాత్మా జ్యోతిరావ్ పూలే మహిళా విద్య కోసం, బడుగు వర్గాల అభ్యున్నతి కోసం, సకలజనుల సామాజిక న్యాయం కోసం పోరాడారని, సమాజంలో సాంఘిక సమానత్వం సాధించి చూపటమే మహాత్మ జ్యోతిరావ్ పూలేకి నిజమైన నివాళి అవుతుందని సింగరేణి సంస్థ చైర్మన్ మరియు ఎండీ ఎన్.బలరామ్ పేర్కొన్నారు. హైదరాబాద్ సింగరేణి భవన్ లో జరిగిన మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతి ఉత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముందుగా మహాత్మ జ్యోతిరావ్ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ప్రసంగిస్తూ 150 సంవత్సరాలకు పూర్వమే జ్యోతిరావ్ పూలే అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాటం చేశారని, మహిళల విద్య కోసం అవిశ్రాంతంగా శ్రమించారని, అణిచివేత చర్యలకు వ్యతిరేకంగా దళితుల తరఫున పోరాడారని వివరించారు. తన భార్య సావిత్రి పూలేకి స్వయంగా విద్య నేర్పి, మహిళ ఉద్యమానికి నాయకత్వం వహించేలా చేశారని, ఆయన గొప్ప నిస్వార్థ సంఘ సంస్కర్త, మానవతావాది అని ప్రశంసించారు. సనాతన మూఢాచారాలకు వ్యతిరేకంగా ఆయన ఉద్యమాలు నడిపారని, అన్ని జాతుల, కులాల వారికి సాంఘిక, ఆర్థిక సమానత్వం కోసం తన జీవితాన్ని ధారపోసారని, ఆయన మహోన్నత సిద్ధాంతాలు మనకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. సభా కార్యక్రమానికి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూమెంట్) ఎస్.డి.ఎం.సుభాని అధ్యక్షత వహించి మాట్లాడారు. బీసీ ఉద్యోగ సంఘాల ప్రతినిధిగా డీ.జీ.ఎం చౌటపల్లి ప్రభాకర తదితరులు ప్రసంగించారు. సింగరేణి భవన్ ఉద్యోగులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మ జ్యోతిరావు పూలే దంపతులకు భారతరత్న ప్రకటించాలి



**చట్టం: శంకరపట్నం :** మహాత్మ జ్యోతిరావు పూలే 198వ జయంతి సందర్భంగా శుక్రవారం శంకరపట్నం మండల కేంద్రంలో పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సతీసహగమనం, బాల్యవివాహాలు వంటి మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన గొప్ప సంఘసంస్కర్త సామాజిక జ్ఞానోదయుడు, సమసమాజ స్థాపనకుకృషి చేసిన తత్వవేత్త కు భారత ప్రభుత్వం వెంటనే భారతరత్న ఇవ్వాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో మండల కేంద్రంలో పూలే దంపతుల విగ్రహాలను బహుజనుల స్ఫూర్తితో నెలకొల్పుతామని ఆయన తెలిపారు.

## ఘనంగా పూలే 199వ జయంతి




- **జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

**చట్టం మెదక్ ప్రతినిధి :** కుల, మతాలకు అతీతమైన సమాజాన్ని నిర్మించడానికి యువత నడుం బిగించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. శుక్రవారం మహాత్మ జ్యోతి రావ్ పూలే 199వ జయంతి నీ పురస్కరించుకొని కలెక్టరేట్ ప్రజావాణి హాల్ నందు గ్రంథాలయ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి, అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య,.వివిధ బీసీ సంఘం నాయకులు తో కలిసి జ్యోతి రావ్ పూలే చిత్రపటానికి పూలమాలు వేసి కలెక్టర్ ఘనంగా నివాళులర్పించారు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా అద్భుత కళా ప్రదర్శనలు నిర్వహించారు, విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి వక్తలు జ్యోతిరావ్ పూలే జీవిత చరిత్ర గురించి వారి మాటల ద్వారా చెప్పడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మ జ్యోతి రావ్ పూలే దంపతులు సమాజ హితం కోసం పాటుపడాలని మనందరికీ స్ఫూర్తి నింపేలా వారు చేసిన సేవలను గుర్తుంచుకోవాలని కలెక్టర్ అన్నారు రాష్ట్ర ప్రభుత్వం సావిత్రిబాయి పూలే జయంతి రోజు మహిళా ఉపాధ్యాయ దినోత్సవం గా నిర్వహించుకుని మహిళా ఉపాధ్యాయులను సన్మానించుకోవడం జరిగిందన్నారు. మహాత్మ జ్యోతి రావ్ పూలే సతీమణి సావిత్రి బాయ్ పూలే కు విద్యను అభ్యసించేలా చేసి ఆమె ద్వారా బాలిక విద్యను ప్రోత్సహించి మహిళా ఉపాధ్యాయులుగా తయారు చేయడం జరిగిందన్నారు. మహనీయుల జయంతులు జరుపుకుని వారి గురించి స్మరించుకోవాలని చెప్పారు. మహనీయుల జయంతులు జరుపుకున్నప్పుడు మహిళలకు సంబంధించి జ్యోతిబాపూలే సతీమణి సావిత్రిబాయి పూలే గురించి చర్చించుకోవడం జరుగుతుందన్నారు. సమాజ హితం కోసం పోరాడిన ఆదర్శ దంపతుల్లో వీరు చరిత్ర పుటల్లో నిలిచిపోతారన్నారు. కుల మతాల కతీతంగా వివక్ష లేని సమాజం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఉద్దేశంగా కలెక్టర్ వివరించారు. అందరూ సమానం బడుగు బలహీన వర్గాల రిజర్వేషన్ కల్పించి విద్యా ఉపాధి అవకాశాలు మెరుగుపరిచి వారి అభివృద్ధిని కాంక్షిస్తూ ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని తెలిపారు. రాజ్యాంగబద్ధంగా అందరికీ హక్కులు కల్పించబడ్డాయని అన్నారు. ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ నిర్మించి ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ఒకే క్యాంపస్ లో విద్యను అభ్యసించే విధంగా చర్యలు తీసుకుంటుందన్నారు రాజీవ్ యువ వికాస పథకం ద్వారా జిల్లాలో సుమారు 4500 మందికి 50 కోట్ల రూపాయలతో స్వయం ఉపాధి రుణాలు సబ్సిడీతో ఇస్తున్నామన్నారు. యువ వికాస పథకంలో ఎవరైనా దరఖాస్తు చేసుకోలేకపోతే అటు యువత దరఖాస్తు చేసుకునేలా వివిధ కుల సంఘ నాయకులు వీరికి ప్రోత్సహించాలి అన్నారు. గ్రంథాలయ చైర్మన్ చిలుమల సుహాసిని రెడ్డి మాట్లాడుతూ సమాజ రుగ్మతలను రూపుమాపేందుకు పోరాడిన వ్యక్తి మహాత్మ జ్యోతిరావ్ పూలే ఎందరో మహానుభావులు వారందరికీ వందనాలు ఎందరో త్యాగధనుల ఫలితం ఈ హక్కుల సాధించుకున్నామని తెలిపారు. కుల వ్యవస్థ పై ఎన్ని అవమానాలు అవాంతరాలు ఎదురైన అనుకున్న లక్ష్యసాధనకు ఆయన చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ అధ్యక్షుడు దొంతి నరేందర్, సెక్రెటరీ రాజ్ కుమార్, డిపిఓ యాదయ్య, జిల్లా బీసీ సంఘం గౌరవ అధ్యక్షుడు మెట్టు గంగారం, జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు నోముల శ్రీకాంత్, మహనీయుల కమిటీ చైర్మన్ ఏ బాలరాజు, బీసీ ఉద్యోగుల సంఘం కార్యదర్శి శేషాచారి, పోచమ్మల గణేష్, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సిబ్బంది తాళ్లపల్లి శ్రీనివాస్, నర్సింలు, భాను ప్రకాష్, వసతి గృహ సంక్షేమ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ జనతా పార్టీ బస్తీ చలో అభియాన్




**చట్టం ఎల్లారెడ్డి:** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఎల్లారెడ్డి పట్టణం లోని గాంధీ చౌక్ వద్ద బస్తీ చలో అభియాన్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందనీ ఎల్లారెడ్డి మండల బిజెపి అధ్యక్షుడు పెద్దెడ్ల నర్సింలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి లోని గాంధీ చౌక్ వీధిలో కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారిని కలిసి మాట్లాడడం జరిగిందని, రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం చేస్తున్నటువంటి, అందిస్తున్నటువంటి సంక్షేమ పథకాల గురించి వివరించడం జరిగిందనీ ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర నాయకులు మాజీ సర్పంచ్ బత్తిని దేవేందర్, మండల అధ్యక్షులు నర్సింలు ,పట్టణ అధ్యక్షులు రాజేష్, మండల ప్రధాన కార్యదర్శి నరేష్, బీజేవైఎం మండల అధ్యక్షులు మహేందర్, పట్టణ అధ్యక్షులు శంకర్, మాజీ ఎంపీపీ నక్క గంగాధర్, మాజీ మండల అధ్యక్షులు ఎస్ ఎన్ రెడ్డి, మాజీ పట్టణ అధ్యక్షులు సతీష్,మండల ఉపాధ్యక్షులు రాములు, వెంకటరెడ్డి, ఓబిసి మండల అధ్యక్షులు సాయిలు, కిసాన్ సెల్ అధ్యక్షులు సంగారెడ్డి, సీనియర్ నాయకులు రాములు, సాయి రెడ్డి, శ్రీనివాస్, నరసింహారెడ్డి, లక్ష్మారెడ్డి, గజానంద్, శివ, ఆంజనేయులు, రావుల కిష్టయ్య, మహిళా నాయకురాలు సుజాత, వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా నాయకులు వివిధ మోర్చలు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు .

## గావ్ చలో బస్తీ చలో అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీ బీబీ పాటిల్.....



**చట్టం బిచ్కుంద:** కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలంలో గావ్ చలో,బస్తి చలో అభియాన్ కార్యక్రమం బండరేంజల్ గ్రామంలో నిర్వహించడం జరిగింది బిచ్కుంద మండల అధ్యక్షులు శెట్పల్లి విష్ణు మాట్లాడుతు బం దరేంజల్ గ్రామంలో కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించడం జరిగింది అదేవిధంగా మండల పరిధిలోని శక్తి కేంద్రాల ఇన్చార్జిలతో మరియు బూత్ కమిటీ కార్యకర్తలతో రచ్చబండ కార్యక్రమం నిర్వహించి బండ రెంజల్ బూత్ లో ఉన్న దేవాలయాలను పరిశుభ్రత చేయాలని అంగన్వాడీలను విజిట్ చేయాలని పాఠశాలలను సందర్శించాలని బిజెపి సీనియర్ నాయకులను సన్మానం చేయాలని పలు కార్యక్రమాలను బూతు స్థాయిలో ప్రతి ఒక్క బూతు కమిటీ సభ్యులు నిర్వహించాలని ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జుక్కల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అరుణతార, విశిష్ట అతిథిగా జైరాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు బిబి పటేల్ గారు గావ్ చలో బస్తీ చలో అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు, మరియు బండరింజల్ గ్రామ భూత అధ్యక్షులు గంగాధర్ పుండలిక్ తదితరులు పాల్గొన్నారు

## జొన్న పంట కొనుగోలు కేంద్రం ప్రారంభించిన సొసైటీ చైర్మన్ శ్రీనివాస్ పటేల్...



**చట్టం మద్నూర్:** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం మద్నూర్ మండల కేంద్రంలో మార్కెట్ యార్డులో జొన్న పంట రైతులు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని మద్నూర్ సింగిల్విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్ కోరారు. మార్క్ఫెడ్ ఆధ్వర్యంలో మద్నూర్ సింగిల్ విండో ద్వారా మద్నూర్ మండల కేంద్రం లోని మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రం ప్రారంభించడం జరిగిందని, జొన్న పంటకు మద్దతు ధర క్వింటాలుకు రూ.3,371 ప్రకటించడం జరిగిందని చైర్మన్ తెలిపారు. తక్కువ ధరలతో దళారులకు అమ్ముకొని మోసపోకుండా మద్దతు ధర కేంద్రంలోని జొన్న పంట అమ్ముకొని మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ రైతులను కోరారు. ఈ జొన్న పంట మద్దతు ధర కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో ఏఎంసి వైస్ చైర్మన్ పరమేష్ పటేల్, సలాబత్పూర్ ఆంజనేయస్వామి దేవాలయ ధర్మాదాయ శాఖ ఆలయ కమిటీ చైర్మన్ రామ్ పటేల్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హనుమాన్లు స్వామి, మాజీ ఎంపీపీ ప్రవీణ్ కుమార్, అనుమాంతరావు దేశాయ్, సింగిల్ విండో కార్యదర్శి బాబురావు పటేల్, జొన్న పంట రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అత్యంత వైభవంగా కాశీ విశ్వనాథ విగ్రహ ప్రతిష్టాపన వేడుకలు...



**చట్టం, రామకృష్ణాపూర్:** క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ శిరిడి సాయిబాబా మందిరంలో 25వ వార్షికోత్సవ వేడుకలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన శ్రీ కాశీ విశ్వనాథ ఆలయంలో విగ్రహ ప్రతిష్ట వేడుకలను వేద పండితుల మంత్రోచరణ మధ్య అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలలో భాగంగా గుర్తనాస్యం, బీజన్యాసం, రత్నన్యాసం, యంత్ర ప్రతిష్ట, దేవతాస్థాపన, ప్రాణ ప్రతిష్ట, కాలన్యాసము, మహాబలిహరణ, పూర్ణాహుతి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అంతకన్నా ముందు శివపార్వతుల ఎదుర్కోలు మహోత్సవం నిర్వహించగా మహిళలు కోలాటాలతో నృత్యాలు చేశారు. లోక కళ్యాణార్థం శివపార్వతుల శాంతి కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా కనుల పండుగగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించి ఎంతో భక్తి శ్రద్ధలతో దేవత మూర్తులను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి మహా అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మాధవరావు, ఎల్లంకి సత్తయ్య, భీమయ్య, బండ అమర్నాథ్ రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గాండ్ల సమ్మయ్య, అబ్దుల్ అజీజ్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.



చట్టం
సంపూర్ణ స్వతంత్ర దినపత్రిక

CHATTAM NEWS

నిజామాబాద్
శనివారం
12.04.2025



# అకాల వర్షా నికి 340 ఎకరాలలో వారి పంట నష్టం.. ఏవో





**చట్టం బిచ్కుంద:** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజక వర్గం బిచ్కుంద మండలంలో నిన్న కురిసిన వడగళ్ల వాన తో వివిధ గ్రామాలలో 340 ఎకరాలలో వరి పంట నష్టం వాటిల్లిందని వ్యవసాయ అధికారి ఆచరిత తెలిపారు. శుక్రవారం నాడు వ్యవసాయ అధికారి ఆచరిత మరియు వ్యవసాయ విస్తీర్ణ అధికారులు కలిసి బిచ్కుంద మండలంలోని పుల్కల్ గ్రామంలో 65 ఎకరాలు, పత్లాపూర్ గ్రామంలో 150 ఎకరాలు, హస్గుల్ గ్రామంలో 60 ఎకరాలు, రాజోల గ్రామంలో 10 ఎకరాలు, దౌల్తాపూర్ గ్రామంలో 20 ఎకరాలు, బిచ్కుందలో 35 ఎకరాలు అలాగే పెద్దతక్కడ పల్లి గ్రామంలో మూడెకరాల జొన్న పంటలు అకాల వర్షం,వడగళ్ల వాన వల్ల పంట నష్టం వాటిల్లిందని అధికారులు ఒక అంచనాకు వచ్చినట్లు తెలిపారు. ఈ నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ వ్యవసాయ అధికారుల వెంట వివిధ గ్రామాలకు చెందిన రైతులు మరియు విస్తీర్ణ అధికారులు లక్ష్మణ్ రాజుల గ్రామ రైతులు అజయ్ పటేల్ ,మనోహర్ పటేల్ హనుమంతు సిద్ధప్ప పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాల అభివృద్ధియే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం



**చట్టం ఎల్లారెడ్డి:** మహిళా సంఘాల అభివృద్ధి కొరకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రజితవెంకట్రామ్ రెడ్డి అన్నారు. శుక్రవారం సబ్దల్పూర్ గ్రామం గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మహిళా సంఘాల సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ.. మహిళా సంఘాల అభివృద్ధి కొరకు కాంగ్రెస్ ప్రభుత్వం వరి కొనుగోలు కేంద్రాలతో పాటు సోలార్ ప్లాంట్లు, రానున్న రోజుల్లో మహిళా సంఘాలకు బ్యాంకు ద్వారా బస్సులను సైతం కొనుగోలుచేసి మహిళలను ప్రోత్సహించడం జరుగుతుందని అన్నారు. రైతులు తమ పండించిన పంటను ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తరలించి లాభాలను గడించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల అభివృద్ధి కొరకు పాటుపడుతూ మహిళలను అభివృద్ధి కొరకు ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే మదన్మోహన్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం మండల మహిళా సంఘాల నాయకురాలు పావని, సావిత్రి, ఏఈఓ రవీందర్, గ్రామ సెక్రెటరీ సునంద, బయ్యని రత్నం, చింతల బాల్యయ్య, ముద్దుల బాల్యయ్య, రవీందర్, గోపాల్, గణేష్, రామచందర్, గంగయ్య, పోచయ్య, అంజయ్య, నారాయణ, సాయిలు, సంగమేష్, సత్యనారాయణ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## సన్న బియ్యం పథకం పేదవాడి ఆత్మగౌరవ పథకం



**చట్టం, ఎల్లారెడ్డి :** దేశంలో ఎక్కడలేని విధంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ పథకం పేదవాడి ఆత్మగౌరవ పథకమని కాంగ్రెస్ పార్టీ నాయకులు వెల్లుట్ల సంతోష్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ...ఉచిత సన్న బియ్యం పేదలకు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దక్కుతుందన్నారు. వినూత్న ఆలోచనతో సన్న బియ్యం పథకాన్ని అమలు చేసి పేద ప్రజల మనసు దోచుకున్నారని వెల్లడించారు. సన్న బియ్యం పంపిణీ తో 80శాతం పైగా బడుగు బలహీన వర్గాల ప్రజలు ప్రయోజనం పొందుతున్నారని పేర్కొంటూ... ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి, అలాగే స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఏ రాష్ట్రంలోనూ సన్న బియ్యం పంపిణీ చేయడం లేదని, ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే ప్రభుత్వం సన్న బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తుందని ప్రజలంతా సన్న బియ్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

## ఘనంగా జ్యోతిబాపూలే 198వ జయంతి వేడుకలు



**చట్టం ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జ్యోతిబాపూలే 198 వ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఇంద్రనగర్ కమ్యూనిటీ భవనం దగ్గర మహాత్మ జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా అతను చేసిన సేవలను స్మరించుకుంటూ... అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో, పాటు మహిళల అభ్యున్నతికై ఆయన చేసిన కృషి, బహుజన వర్గాల ఉన్నతికి పాటుపడిన సందర్భాలను గుర్తుచేసుకుంటూ జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాలతో సత్కరించి పూలే గారి 198వ జయంతి వేడుకను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు శివానందం మాదిగ, ఉపాధ్యక్షులు సాయిబాబు మాదిగ, రాష్ట్ర సీనియర్ నాయకులు కంతి పద్మారావు మాదిగ, పట్టణ కమిటీ అధ్యక్షులు నరేష్ మాదిగ, సీనియర్ నాయకులు సామెల్ మాదిగ, సలహాదారులు మానయ్య మాదిగ, రాజు మాదిగ, పోచయ్య మాదిగ, అబ్దుల్ రజాక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ జ్యోతిబాపూలేని ఆదర్శంగా తీసుకోవాలి



**చట్టం రామగుండం కమిషనరేట్:** ప్రతి విద్యార్థి జ్యోతిబాపూలేను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని ఆమెన్ జస్టిస్ ఫర్ సిటిజన్స్ హ్యూమన్ రైట్స్ అండ్ వరల్డ్ సోషల్ పీస్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఉల్లెంగ నాగరాజు అన్నారు. బహుజన వర్గాల నాయకుడు మేధావి జ్యోతిబా పూలే జన్మదిన వేడుకలు నిజామాబాదు లోని వినయ్ నగర్ హనుమాన్ జంక్షన్ లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉల్లెంగా నాగరాజు మాట్లాడుతూ.... విద్య యొక్క ప్రాముఖ్యతను సమాజానికి తెలియజేసిన వ్యక్తి పూలే అని తన సతీమణి సావిత్రిబాయి పూలే సహకారంతోస్త్రీ విద్య వ్యాప్తికి కూడా ఇదోదికంగా కృషి చేశారని సత్యశోధక్ అనే సంస్థను స్థాపించి బడుగు బలహీన వర్గాల పిల్లలకు విద్యను అందించడమే కాకుండా వారిలో నైతిక విలువలు పెంపొందించడానికి కృషి చేశారని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి పూలేని స్ఫూర్తిగా తీసుకొని జీవితంలో ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు సావిత్రిబాయి పూలే జ్యోతిబాపూలే యొక్క జీవిత చరిత్రను చదివి ఉత్తమ పౌరులుగా ఎదగాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకుడు అజయ్, హెచ్ఆర్సి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పూలే విగ్రహం ఆవిష్కరించిన ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్



**చట్టం రామగుండం :** రామగుండం ఏరియా 1 జిడికె ocp5 గని ఆవరణలో 198వ పూలే జయంతి పురస్కరించుకొని సింగరేణి బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహా ఆవిష్కరణలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ మరియు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్యతో కలిసి నూతన విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముందుగా పూలే జయంతి సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ ఇది గొప్ప శుభ పరిమాణం అని కొనియాడారు.. సింగరేణిలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఎన్నో ఏళ్ల నుండి ఎదురుచూస్తున్న బీసీ చీఫ్ లైజన్ నియమించడం జరిగిందని ఆర్ కృష్ణయ్యతో ఎన్నో బీసీ ఉద్యమాలలో పాల్గొని బీసీల హక్కుల కోసం పోరాటం చేయడం జరిగిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో రాహుల్ గాంధీ చెప్పిన మాటని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కట్టుబడి బీసీ కులగణన చేసి 42% ఇవ్వడం జరిగింది అని చెప్పారు. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మేమందరం మొన్న ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద బీసీ బిల్లును పార్లమెంట్లో ఆమోదింప చేయాలని ధర్నా చేసి కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరించడం జరిగిందని తద్వారా బీసీ వాదాన్ని దేశవ్యాప్తంగా తీసుకపోవడం జరిగిందని తెలియజేశారు. సింగరేణి బిసి అసోసియేషన్ సంఘము బలోపేతానికి ఎమ్మెల్యేగా పూర్తిస్థాయిలో కృషి చేస్తానని చెప్పడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని రాబోయే రోజుల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకపోయి బీసీల సంక్షేమము హక్కుల కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సింగరేణి బిసి ఉద్యోగ సంఘ నాయకులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పూలే చిత్రపటానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్



**చట్టం నేరడిగొండ :** మండల కేంద్రంలో ఆయిన నివాసంలో బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, సంఘ సంస్కర్త, స్ఫూర్తిప్రదాత మహాత్మా జ్యోతి రావు పూలే జయంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్ణ వివక్షను రూపుమాపడం కోసం, దళిత బహుజన మహిళ వర్గాల అభ్యున్నతి కోసం పూలే ఆచరించిన కార్యాచరణ మహోన్నతమైనది. కుల, లింగ వివక్షకు తావు లేకుండా సమానత్వం, విద్య, హక్కుల పరిరక్షణ ద్వారానే సామాజిక ఆర్థిక సమున్నతికి బాటలు పడతాయన్న వారి ఆలోచనే తొమ్మిదిన్నరేళ్ల బిఆర్ఎస్ పాలనకు స్ఫూర్తి. వేల కోట్లతో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ మహిళ వర్గాల అభ్యున్నతి కోసం కెసిఆర్ అనేక సంక్షేమ పథకాలు ప్రారంభించి విజయవంతంగా అమలు చేశారు. మహాత్మ జ్యోతి రావు పూలే విదేశీ విద్యా పథకం ప్రారంభించి బడుగు బలహీన వర్గాల బిడ్డలకు అత్యున్నత విదేశీ విద్యను అందించారు. కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా ఆడబిడ్డకు పెళ్ళికి సాయం చేశారు. బాల్యవివాహాలు కట్టడి చేసి, సామాజిక మార్పుకు నాంది పలికారు. పూలే జయంతి సందర్భంగా ఆ మహనీయుడి సేవలు స్మరించుకుంటూ వారి ఆశయ సాధనకు అందరం పునరంకితం అవుదాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## పెగడాపల్లిలో అట్టహాసంగా ఎల్లమ్మ జాతర కుస్తీ పోటీలు



**చట్టం, బోధన్ :** నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం పెగడాపల్లి గ్రామంలో ఎల్లమ్మ జాతర సందర్భంగా గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు అట్టహాసంగా జరిగాయి. ఎల్లమ్మ మందిరంలో ఉదయం నుండి ప్రత్యేక పూజలతో కార్యక్రమం ప్రారంభమైంది. భక్తుల భక్తిశ్రద్ధలతో ఆలయం వద్ద పూజలు నిర్వహించగా, అనంతరం కుస్తీ పోటీలు ప్రారంభమయ్యాయి. ఢిల్లీ నుంచి వచ్చిన మహిళా మల్లయోధురాలు పోటీలో విజయం సాధించి అందరి ప్రశంసలు అందుకుంది. ఈ కుస్తీ పోటీల్లో తెలంగాణ, మహారాష్ట్ర ప్రాంతాల మలయోధులు పాల్గొన్నారు. గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పండుగ వాతావరణం నెలకొల్పారు. పెగడపల్లి గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ డి. లక్ష్మారెడ్డి, వైస్ చైర్మన్ బి.సంజీవ్ ప్రధాన కార్యదర్శి ఎం నాగరాజు, కోశాధికారి అబ్బయ్య, ఉప కార్యదర్శి గణేష్, పిఎసిఎస్ చైర్మన్ రాజారెడ్డి, మాజీ సర్పంచ్ శంకర్, పోతరెడ్డి, సుదర్శన్, రవి, హైమద్, సాయిలు, రామయ్య డి సాయిలు, నారాయణరెడ్డి, కృష్ణారెడ్డి గ్రామ ప్రముఖులు, యువత, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహాత్మా జ్యోతి బాపులే జయంతి వేడుకలు



**చట్టం, తూప్రాన్:** మహాత్మా జ్యోతి రావు పులే జయంతినీ తూప్రాన్ పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తాలో స్థానిక బీసీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పూలే చిత్ర పఠానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ ఠాగూర్ చిన్నలింగ్ మల్లిఖార్జున్ గౌడ్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతి రావు పులే గారు భారత సమాజంలో ఒక అపూర్వమైన మార్పు తీసుకు వచ్చిన మహానుభావుడు, సమాజ సేవలో ఎన్నో విప్లవాత్మకమైన మార్పులకు కారకులయ్యారని అన్నారు. పూలే 1848 లో తన భార్య సావిత్రి బాయిపులేతో కలిసి పూణేలో భారత దేశంలో తొలి బాలికల పాఠశాలను స్థాపించారని అన్నారు. అలాగే 1873 లో స్థాపించిన సత్య శోధక సమాజం ద్వారా కుల వ్యవస్థ, అస్పృశ్యత, లింగ వివక్షలకు వ్యతిరేకంగా పోరాడిన ఘనత మహాత్మా జ్యోతి రావు పులే దే అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం బీసీ ఉపాధ్యక్షులు బీసీ ఠాగూర్ చిన్నలింగ్ మల్లికార్జున్ గౌడ్, బీసీ సంఘం నాయకులు శివ కృష్ణగౌడ్, దంతేపల్లి నవీన్, మాజీ వార్డు సభ్యులు, పోతారాజ్ ధన్రాజ్, రవి నాథ్, బాలేష్ తదితరులు పాల్గొన్నారు.

## భైంసా లో ఘనంగా సావిత్రి జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు




**చట్టం, భైంసా :** నిర్మల్ జిల్లా బైంసా పట్టణంలో శుక్రవారం గోపాల్ రావు పాటిల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మేధావులు, గురు శిష్యులు మహాత్మ జ్యోతిబా పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కర్రోల బుచ్చయ్య మాట్లాడుతూ, "సత్యశోధక్ సమాజాన్ని స్థాపించి, అన్ని మతాల, కులాల ప్రజలలో ఏకత్వం ప్రబల్చిన మహనీయుడు జ్యోతిబా పూలే. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమైనది. బాలికా విద్యలో తొలి అడుగు వేసి స్వదేశీ బాలికల పాఠశాలను స్థాపించినవారు. ఇటు అంబేద్కర్ కూడా అంటరానితనం నిర్మూలన, సమానత్వం కోసం జీవితాన్ని అర్పించారు," అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మోటివేషనల్ స్పీకర్ వాడేకర్ లక్ష్మణ్ గారు మాట్లాడుతూ, "స్వతంత్ర భావాలతో జీవించే బానిస వేయిరేట్లు మెరు - బాబాసాహెబ్ అన్నట్లు విద్యతోపాటు వినయం శీలం కలిగి ఉండటం అత్యంత అవసరం. దేశ అభివృద్ధి అంటే కేవలం భవనాలు కాదు, ప్రజల నైతిక అభివృద్ధే నిజమైన అభివృద్ధి, అని విద్యార్థులను ఉద్దేశించి వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ రఘునాథ్ మాట్లాడుతూ, బాబాసాహెబ్ తన కుటుంబాన్ని త్యాగం చేసి దేశ ప్రజల అభివృద్ధికి తన జీవితాన్ని అంకితం చేశారు. 'ఎంత కాలం బతికామన్నది కాదు, ఎంత గొప్పగా జీవించామన్నదే ముఖ్యం' అన్న ఆయన వాక్యాన్ని మరిచిపోకూడదు," అని అన్నారు. ఈ కార్యక్రమం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జాదవ్ ప్రకాష్ ఆధ్వర్యంలో, యూనిట్ 1, 2, ప్రభుత్వ పాలన శాస్త్రం, రాజనీతి శాస్త్రం విభాగాల సంయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ పవన్ కుమార్, డా. పి.జి. రెడ్డి, సురేందర్, డా. శంకర్ రాజయ్య, డా. కోసారి సంతోష్ కుమార్, దివ్య తదితర అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పేదింటి ఆడపడుచులకు అండగా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్



**చట్టం, ముధోల్ :** ముధోల్ మండల కేంద్రం లోని క్యాంపు కార్యాలయం నందు శుక్రవారం ముధోల్ (33) మండలం తానూర్ (30) మండలం మండలాలకు చెందిన ఆయా గ్రామాల 63 మంది లబ్దదారులకు కల్యాణలక్ష్మి షాదీముబారక్ చెక్కులను ముదురు నియోజకవర్గ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తాహాసిల్దార్లు, మాజీ, ఎంపీటీసీలు సర్పంచులు మండలాల సీనియర్ నాయకులు, ఆయ గ్రామాల లబ్దిదారులు , సంబధిత అధికారులు, తదితరులకు ఉన్నారు.

## త్రిబుల్ ఐటీ లో కొనసాగుతున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల నిరసన



**చట్టం, బాసర:** రాజీవ్ గాంధీ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన విశ్వవిద్యాలయం బాసర త్రిబుల్ ఐటీ లో గత రెండు రోజుల నుండి కొనసాగుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ల నిరసనలు శుక్రవారం ముధోల్ నియోజకవర్గం శాసనసభ్యులు పవర్ రామారావు పటేల్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 21న తెలంగాణ ప్రభుత్వ జి.ఒ 21పై వ్యతిరేకత వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో తమకు న్యాయం జరిగేలా రాష్ట్ర గవర్నర్తో భేటీ అయిన తర్వాత తమ సమస్యలను క్షుణ్ణంగా వివరిస్తానని వెల్లడించారు ఈ సందర్భంగా అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఇప్పటికే కొంతమంది రాజీనామాలు కూడా చేయడం జరిగిందని ఎమ్మెల్యేను వివరించారు. ఉపకులపతి గారికి తమ మూకుమ్మడి రాజీనామా లేఖను సైతం అందించమని తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా టీచింగ్ తో పాటు పరిపాలనా బాధ్యతలు కూడా నిర్వర్తిస్తూ, విశ్వవిద్యాలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేశామని అయినప్పటికీ, సేవలకు గుర్తింపు లేకపోవడమే కాకుండా, క్రమబద్ధీకరణకు సంబంధించి ఎటువంటి నిర్ణయం తీసుకోకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడాన్ని తీవ్రంగా ఖండించడం జరుగుతుందని అన్నారు మేము న్యాయమైన డిమాండ్లను సంవత్సరాలుగా వినిపిస్తూనే ఉన్నాం. కానీ ఇప్పటివరకు ప్రభుత్వ స్పందన శూన్యం. ఈ పరిస్థితుల్లో అదనపు భాధ్యతలు నిర్వహించడం అన్యాయం. అందుకే ఈ రాజీనామా ఒక్కటే మాకు మిగిలిన మార్గం, అని అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ మధ్యప్రకులు ప్రొఫెసర్లు సిబ్బంది తదితరులు ఉన్నారు

## త్రిబుల్ ఐటీ లో ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి



**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** విద్యా, హేతువాదం, సమానత్వానికి నడిపించిన స్ఫూర్తిదాయక నాయకుడు మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ ముఖ్య అతిథిగా హాజరై, మహాత్మా పూలే చిత్ర పటానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. తదనంతరం మహాత్మ పూలే తత్వాన్ని గురించి ప్రసంగించారు. పూలే సంఘ సంస్కర్తగా చేసిన కృషిని, విద్యా విప్లవానికి తీసుకువచ్చిన మార్గదర్శనాన్ని విశదీకరించారు. పూలే జీవితం సమాజానికి ఎంతగానో అవసరమైందని, ఆయన చూపిన మార్గం నేటి యువతకు దిక్సూచి కావాలన్నారు. విద్య ద్వారా మానవుని ఆలోచన విధానాన్ని మార్చగలమన్న నమ్మకాన్ని ఆయన నెలకొల్పారని గుర్తు చేశారు. కులమత ఆధిపత్యాలకు వ్యతిరేకంగా పోరాడిన పూలే వంటి మహోన్నతులను స్మరించుకోవడం అవసరం అని పిలుపునిచ్చారు. ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీధరన్ విశిష్ట అతిథిగా పాల్గొని, పూలే సామాజిక స్పృహను, మహిళా విద్య, కుల వివక్షతో పోరాటం వంటి అంశాలపై లోతుగా చర్చించారు. ఈ సభలో ఏవో రణధీర్, అసోసియేట్ డీన్ నాగరాజు, నాగాంజనేయులు, సతీష్ కుమార్ డాక్టర్ విజయ్ కుమార్, శ్యాంబాబు, రంజిత్ కుమార్, , శ్యాంసుందర్, లింబాద్రి, నాగలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.
మహనీయుల పోస్టర్లు విడుదల చేసిన వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మహనీయుల జయంతి ఉత్సవాల గోడపత్రిని వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, ఓ ఎస్ డి ప్రొఫెసర్ మురళీధర్షన్, ఏవో రణధీర్ లతో కలిసి పోస్టర్లు విడుదల చేశారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14ను పురస్కరించుకొని నినాలుగు రోజులు పాటు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తారని తెలిపారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, డాక్యుమెంటరీ, పోస్టర్ ప్రెజెంటేషన్, స్కిట్స్, తదితర పోటీలను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## జ్యోతిరావు పూలే సావిత్రిబాయి దంపతులకు ఆదర్శంగా తీసుకోవాలి



**చట్టం, ముధోల్ :** ముధోల్ నియోజకవర్గం మహాత్మ జ్యోతిరావు పూలే సావిత్రిబాయి దంపతుల విగ్రహాన్ని శాసన సభ్యులు పవార్ రామారావు పటేల్ ఆవిష్కరించారు. పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభాలో ఆయన మాట్లాడుతూ.. మూఢ విశ్వాసాలను అజ్ఞానానికి కారణమైన కొందరు మనువాదులను పికిలించాలంటే విద్య సరైన మార్గమని అందరికి విద్య అందలేనే కృషి చేశారని తెలిపారు.. కచ్చితంగా నిధుల ద్వారా తమ సమస్యలను తీరుస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో బైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ అనంతరావు పటేల్ ,పోతన్న యాదవ్, మాజీ సర్పంచ్ రాజేందర్, అనిల్, రమేష్ ,భూమేష్ ,ప్రసాద్ ,ఎజాజుద్దీన్, బాబర్, లక్ష్మన్న, విశ్వంబరు, గంగాధర్, గ్రామానికి చెందిన వి డి సి కమిటీ చైర్మన్ గ్రామస్తులు అన్ని వర్గాలకు చెందిన దళిత సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

CHATTAM NEWS

చట్టం
సంపూర్ణ స్వతంత్ర దినపత్రిక

# సహకార బ్యాంక్ ఆధ్వర్యంలో వినియోగదారులకు రుణాలపై అవగాహన



**చట్టం ధర్పల్లి:** ధర్పల్లి మండల కేంద్రంలోని సహకార బ్యాంక్ ఆధ్వర్యంలో బ్యాంకు వినియోగదారులకు అందించే వివిధ రుణాలపై శుక్రవారం బ్యాంకు మేనేజర్ కాశి విశ్వనాథ్ అవగాహన కల్పించారు. రైతు మిత్ర ఎకరానికి రెండున్నర లక్షలు, నూతన ఇల్లు నిర్మించుకోవడానికి మాడిగేజిపై 30 లక్షల వరకు రుణ సదుపాయం, సీనియర్ సిటిజనులకు అత్యధిక వడ్డీ పై ఫిక్స్ డిపాజిట్ సదుపాయం, బంగారు ఆభరణాలపై తక్షణ రుణ సదుపాయం , లాకర్ సదుపాయం,తమ బ్యాంకు అందిస్తుందని, దీంతోపాటు ఆన్లైన్ సేవలు అందుబాటులో ఉన్నాయని వీటన్నింటిని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని మేనేజర్ కోరారు. ఈ కార్యక్రమంలో ధర్పల్లి సింగల్ విండో చైర్మన్ చిన్నారెడ్డి, బ్యాంకు అధికారి నవీన్ రైతులు వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఆధ్వర్యంలో దమ్మనపేట్లో పాదయాత్ర



**చట్టం ధర్పల్లి:** ధర్పల్లి మండలం లోని దమ్మన్న పేట గ్రామంలో జై బాబు జై భీమ్ జై సమ్మిదాన్ కార్యక్రమంలో భాగంగా మండల అధ్యక్షుడు చిన్న బాలరాజ్ ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర నిర్వహించారు, ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని మహాత్మా గాంధీ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి వారు నివాళులర్పించారు. కేంద్ర ప్రభుత్వం ఇష్టా రీత్యా రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ బిల్లులను పాస్ చేయించుకుంటుందని స్వాతంత్ర సమరంలో పాల్గొన్న మహాత్ములను సైతం మరిచిపోయిందని, విమర్శించారు. రాబోయే రోజుల్లో ప్రజలు బిజెపికి తగిన బుద్ధి చెప్తారని బాల్రాజ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సిహెచ్. నరసయ్య, శ్రీనివాస్ , k.రాజశేఖర్ ,చిన్నారెడ్డి, మిట్టపల్లి గంగారెడ్డి, పుప్పాల సుభాష్ ,సురేందర్ గౌడ్, ఇద్దరు మండల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

# అంగన్వాడీలో జ్యోతిరావు పూలే జయంతి..



**(చట్టం ప్రతినిధి కామారెడ్డి ):** కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని లింగాపూర్ గ్రామం లోని అంగన్వాడీ కేంద్రం(4) లో జ్యోతిరావు పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. అంగన్వాడి టీచర్ వైద్య ఉమారాణి చిన్న పిల్లల సమక్షంలో పూలే చిత్రపటానికి మాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను అంగన్వాడి పిల్లలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా లక్ష్మి,అంగన్వాడీ పిల్లలు,తల్లులు పాల్గొన్నారు.

# గొల్లపల్లిలో పూలే జయంతి..



**(చట్టం ప్రతినిధి కామారెడ్డి ):** రామారెడ్డి మండలంలోని గొల్లపల్లి బి ఆర్ఎస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మహాత్మ జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. జయంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమం గ్రామ పెద్దల సమక్షంలో ఆధ్వర్యంలో వి డి సి అధ్యక్షులు పెద్ద మల్లేష్ , అధ్యక్షులు రైతు అధ్యక్షులు వి రాజనర్సింలు టిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు రెడ్డి మల్లేష్ మర్రి ప్రభాకర్ మాజీ ఉపసర్పంచ్ నరసయ్య , పెద్ద రాజయ్య ,జై మల్లయ్య జై నడిపి మల్లయ్య ,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొనడం జరిగింది.

# ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు ప్రారంభం



**చట్టం ఎల్లారెడ్డి:** క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసే యంత్రాలను రాష్ట్ర క్షయ అధికారి (STO) ఎల్లారెడ్డి, కామారెడ్డి ఆసుపత్రులకు పంపడం జరిగిందని, కామారెడ్డి తెలంగాణ డైగ్నోస్టిక్ లో ఒకటి అలాగే ఎల్లారెడ్డి ఆస్పత్రి లో ఒకటి ప్రారంభించడం జరిగిందని ఎల్లారెడ్డి సూపరింటెండెంట్ డా. రవీంద్రమోహన్ అన్నారు.

ఇందులో ఎల్లారెడ్డి సూపరింటెండెంట్ డా, రవీంద్రమోహన్, డిపిపిఎం శోభ, డిపిఎం సుధాకర్, ఎస్ టి ఎస్ విజయ్, ల్యాబ్ టెక్నీషియన్, సంజీవ్ పాల్గొన్నారు.

# పోషణ పక్వాడ పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ రాహుల్ శర్మ



**చట్టం భూపాలపల్లి ప్రతినిధి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో మహిళా, శిశు, వయోవృద్ధులు మరియు దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీ నుండి 22వ తేదీ వరకు చేపట్టనున్న కార్యక్రమాలు పోషణ పక్వాడ కార్యక్రమాల షెడ్యూల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నాలుగు ప్రధాన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సంక్షేమ శాఖ అధికారులకు సూచించారు. ముఖ్యంగా అంగన్వాడీ సిబ్బంది గర్భిణీలు, బాలింతల ఆరోగ్య సంరక్షణ చర్యలను చేపట్టాలన్నారు.గర్భిణీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని అన్నారు. రెండు సంవత్సరాల కంటే తక్కువ వయస్సున్న చిన్నారుల పెరుగుదలను నిరంతర పర్యవేక్షణ చేయాలని సూచించారు. నిర్దేశిత మాడ్యూల్ ప్రకారం పోషణ పక్వాడ కార్యక్రమాలు నిర్వహించి గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహార లోపాలను తగ్గించడానికి కృషి చేయాలని తెలిపారు. పిల్లల్లో ఊబకాయాన్ని తగ్గించేందుకు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేయాలని తెలిపారు. గర్భ నిర్ధారణ జరిగిన నాటి నుండి బిడ్డకు రెండు సంవత్సరాలు వచ్చేవరకు ప్రతి దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని తెలిపారు. తీవ్ర, అతితీవ్ర పోషణ లోపం ఉన్న చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు తగు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరాన్ని కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ అధికారి మల్లీశ్వరి, డిపిఓ నారాయణ రావు, డిఆర్డీఓ నరేష్, పరిశ్రమల శాఖ జిఎం సిద్ధార్థ, బిసి, ఎస్సి సంక్షేమ అధికారులు శైలజ, సునీత, డీఈఓ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా అయ్యప్ప స్వామి జన్మదిన వేడుకలు



**చట్టం, నవీపేట్ :** అయ్యప్ప స్వామి జన్మదినం సందర్భంగా నవిపేట్ మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఆ స్వామి యొక్క జన్మదిన వేడుకలను శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి జన్మదినన్నీ పురస్కరించుకొని ఉదయం ఆలయంలో లక్ష్మీ గణపతి హోమం, విశేష నవవిధ అభిషేకములు, మధ్యాహ్నం స్వామివారి తొట్లే అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శశాంక్ జోషి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి మహిళను కోటీశ్వరురాలిని చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- **ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**




**చట్టం /పరకాల :** పరకాల మెప్మా విభాగం ఇందిరా మహిళా శక్తి పథకం కింద మాతృ దీవెన క్యాంటీన్ ను మెప్మా మహిళా స్వశక్తి భవనం ఆవరణలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళను కోటీశ్వరురాలుగా ఎదగాలని ప్రతి రంగంలో మహిళలు ముందుండి ఆర్థిక స్వావలంబన దిశగా పయనించాలని అందుకు తన సహాయ సహకారాలు అహర్నిశలు అందిస్తారని తెలియజేశారు. అంతేకాకుండా ప్రభుత్వ పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్యాంటీన్ నిర్వహాకురాలైన గోవిందు సంతోషమ్మ మరియు వారి టీం సభ్యులందరినీ కూడ ఎమ్మెల్యే అభినందించారు. మెప్మా విభాగం సిబ్బందిని ప్రియదర్శిని పట్టణ సమాఖ్య అధ్యక్షులను అభినందిస్తూ అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పరకాల ఆర్డిఓ డాక్టర్ కే నారాయణ, యంపీడీవో పెద్ది ఆంజనేయులు, తహసీల్దార్ ఏ విజయ లక్ష్మి మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేష్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సుష్మా సబ్ రిజిస్ట్రార్ డి సృజన్ కుమార్, పరకాల టౌన్ సిఐ క్రాంతి క్రాంతి మెప్మా డీఎంసీ యం రజితా రాణి, మెప్మా పరకాల టీఎంసీ తడుగుల సతీష్ టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు కొయ్యడ శ్రీనివాస్, మెప్మా ప్రియదర్శిని పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు సరిత, రుక్మిణి, అమరావతి, పరంజ్యోతి, సాంబయ్య, గోవిందు కుమార్, మెప్మా ఆర్పీలు, ఎస్ ఎస్ జి సభ్యులు తదితరులు పాల్గొన్నారు .

# అంగరంగ వైభవంగా గుంతపల్లి శ్రీ సీతారామ స్వామి కల్యాణోత్సవం



- **ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**

**చట్టం,అబ్దుల్లాపూర్మెట్:** గుంతపల్లి గ్రామంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో సీతారాముల కళ్యాణ మహోత్సవం శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామ మాజీ సర్పంచ్ కరిమెల వెంకటేష్ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు సీతారాముల కల్యాణానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేద పండితులు వేదమంత్రోచ్ఛారణల మధ్య కన్నుల పండువగా రాములోరి కళ్యాణం నిర్వహించారు. ఈ కళ్యాణోత్సవానికి ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలను తిలకించేందుకు భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. రామనామ స్మరణతో ఆలయం మార్మోగింది. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. స్వామివారి ఆశీస్సులు ఎల్లవేళలా ప్రతి ఒక్కరిపై ఉండాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, వర్షాలు సకాలంలో సమృద్ధిగా కురిసి పాడిపంటలు చక్కగా పండాలని, రైతు సోదరులు సంతోషంగా ఉండాలని స్వామి వారిని వేడుకున్నామని తెలిపారు. అనంతరం నిర్వహించిన అన్నదానంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ కళ్యాణోత్సవంలో గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ సిహెచ్ భాస్కరాచారి, మాజీ జెడ్పీటీసీ బింగి దేవదాస్ గౌడ్, అబ్దుల్లాపూర్మెట్ సిఐ అంజిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ అంతటి భూకైలాష్ గౌడ్ పద్మావతి, ప్రధాన కార్యదర్శి అంతటి శ్రీశైలం గౌడ్, వైస్ చైర్మన్ ఎండి ఇస్మాయిల్, వరద శంకర్, కోశాధికారి కరిమెల దేవేందర్, ఆలయ కమిటీ సభ్యులు, పలువురు నాయకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బాసర బీరప్ప ఆలయానికి నిధులు మంజూరు



**చట్టం, బాసర :** నిర్మల్ జిల్లా బాసర మండల కేంద్రంలోని ధనగరి కులస్తుల ఆరాధ్య దేవుడైన బీరప్ప ఆలయం కలదు ఈ నేపథ్యంలో బాసర బీరప్ప ఆలయానికి నూతనంగా నిర్మించడానికి ముదురు నియోజకవర్గ శాసనసభ్యులు పవర్ రామారావు పటేల్ శుక్రవారం 8 5వేల నిధులతో కూడిన ప్రొసీడింగ్ కాపీని కుల సంఘ పెద్దలకు అందజేశారు. ఈ సందర్భంగా కుల పెద్దలు వారు మాట్లాడుతూ గత కొన్ని దశాబ్దాల కాలం నుండి బీరపాలయం లేకుండా ఉండేదని ఇప్పుడు మీ హాయంలో నూతనంగా నిర్మించడానికి బీరపాలయం ప్రొసీడింగ్ కాపీ అందించడంతో ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నామని ప్రతి సంవత్సరం సనాతన ధర్మం ప్రకారం వీరప్ప కథలు చెబుతూ ప్రతి గ్రామ గ్రామీణ తిరుగుతూ బీరప్ప గుడి వద్ద పూజలు చేయడానికి గుడి లేకపోవడంతో కొందరు నిరుత్సా పడ్డారు ఇప్పుడు అందరం సంతోషం వ్యక్తం చేస్తున్నామని ఎమ్మెల్యే కి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ అనంతరావు పటేల్, దేవోజి భూమన్న, బిదూర్ రమేష్, రాష్ట్ర కౌన్సిల్ బిజెపి సభ్యులు పోతగంటి సతీష్ రావు, మోహన్ రెడ్డి, శ్రీనివాస్, రమేష్, కుల పెద్దస్తులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మండలంలోని చేపూర్ గ్రామంలో శుక్రవారం రోజు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గ్రామ అయ్యప్ప మహిళాసంఘం ఆధ్వర్యంలో ఆర్మూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సురకంటీ చిన్నా రెడ్డి, చేతుల మీదుగా కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏ గ్రేడ్ దొడ్డు రకం రూ 2320. కామన్ రకం రూ 2300. సన్న రకానికి 2300 ప్లస్ 500 రూపాయలు బోనస్ లభిస్తుందని ఆయన తెలిపారు. ఈ సౌకర్యాన్ని ప్రతి ఒక్క రైతు సద్వినియం చేసుకోవాలన్నారు. కష్టపడి పండించిన పంటలను దళారులను నమ్మి అమ్మి మోస పోవద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయిస్తే మద్దతు ధర లభిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో చేపూర్, పల్లె గ్రామాల కాంగ్రెస్ పార్టీ శాఖ అధ్యక్షులు దాసరి శ్రీకాంత్, రామ్ సన్, తాజా మాజీ సర్పంచ్ ఇందూరు సాయన్న, మాజీ సర్పంచ్ కుస్తాపురం గంగారెడ్డి, ఓ బి సి మండల అధ్యక్షుడు కటికే శ్రీనివాస్, క్రిస్టియన్ మైనారిటీ మండల అధ్యక్షుడు కంపదండి వినోద్, పల్లె విడిసి అధ్యక్షుడు ఎస్ రవి, కోశాధికారి జోరిగే నవీన్, జోరిగే చిన్న గంగాధర్, దామోదర్, సి ఎ లు సర్దా సంతోష, సింధుకర్ అమల, అనిత, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం రోజు భారతీయ జనతా పార్టీ ఆర్మూర్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో బాపు జ్యోతిరావు పూలే 198వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాపు జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణ అధ్యక్షులు మందుల బాలు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు యామాద్రి భాస్కర్, జిల్లా అధికార ప్రతినిధి జస్సు అనిల్, కిసాన్ మోర్చా నాయకులు నూతల శ్రీనివాస్ రెడ్డిలు మాట్లాడుతూ, వారి ఆశయ సాధనకై పని చేద్దామని నినాదాలు చేశారు. జ్యోతిబా పూలే ఒక భారతీయ సామాజిక సంస్కర్త, కార్యకర్త, విద్యావేత్త. ఆయన కుల వివక్ష, లింగ అసమానతలకు వ్యతిరేకంగా పోరాడారన్నారు. ఆయన మహిళా విద్యను ప్రోత్సహించారు, సామాజిక సమానత్వం కోసం సత్యశోధక్ సమాజ్‌ను స్థాపించారు అని అన్నారు. ఈ దేశంలో స్వతంత్రం రాకముందే మొట్టమొదటి ఉపాధ్యాయులుగా వారి దంపతులు ఈ దేశంలో ఆడబిడ్డలపై జరుగుతున్నటువంటి ఆకృత్యాలను అరికట్టడానికి చదివే మార్గమని చదువు ఉంటేనే వీటన్నిటికీ పరిష్కార మార్గం అని ఆలోచించిన మొదటి పంతులమ్మ వారి సతీమణి విద్యాబుద్ధులు నేర్పించిన మొట్టమొదటి ఉపాధ్యాయురాలు అని అన్నారు. ఈ కార్యక్రమంలో మందుల వీరభద్రి, మందుల పోశెట్టి, పాన్ శీను, పులి యుగేందర్, గుగులోత్ తిరుపతి నాయక్, వంగ వివేకానంద్, బాసెట్టి రాజ్ కుమార్, శ్రీధర్, ఉదయ్ గౌడ్, కొడిగెల సుధాకర్, ప్రసన్న గౌడ్, గోపి, నవీన్, మోహన్ రెడ్డి, అభిషేక్, నూనె శ్రీనివాస్, కృష్ణ, మనీ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ జ్యోతిబాపూలేని ఆదర్శంగా తీసుకోవాలి



**చట్టం, భూపాలపల్లి ప్రతినిధి :** ప్రతి విద్యార్థి జ్యోతిబా పూలేను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని మహాముత్తారం మండలం ములుగుపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాశం సంజీవరెడ్డి అన్నారు. బహుజన వర్గాల నాయకుడు మేధావి జ్యోతిబాపూలే జన్మదిన వేడుకలు ములుగుపల్లె ఉన్నత పాఠశాలలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులు వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సమావేశంలో సంజీవరెడ్డి మాట్లాడుతూ విద్య యొక్క ప్రాముఖ్యతను సమాజానికి తెలియజేసిన వ్యక్తి పులే అని తన సతీమణి సావిత్రిబాయి పూలే సహకారంతో స్త్రీ విద్య వ్యాప్తికి కూడా ఇతోధికంగా కృషి చేశారని సత్యశోధక్ అనే సంస్థను స్థాపించి బడుగు బలహీన వర్గాల పిల్లలకు విద్యను అందించడమే కాకుండా వారిలో నైతిక విలువలు పెంపొందించడానికి కృషి చేశారని పేర్కొన్నారు ప్రతి విద్యార్థి పూలే ని స్ఫూర్తిగా తీసుకొని జీవితంలో ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు సావిత్రిబాయి పూలే జ్యోతిబాపూలే యొక్క జీవిత చరిత్రను చదివి ఉత్తమ పౌరులుగా ఎదగాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు దాసరి రాజేంద్రప్రసాద్, అనిల్ నాయక్, సకరం నాయక్, కామిడి సతీష్ రెడ్డి, చంద్రకళ, పెనుకుల యాదగిరి, సుధాకర్ రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# బలహీన వర్గాల ఆశాజ్యోతి

- **నిత్య స్ఫూర్తి ప్రదాత మహాత్మ జ్యోతిబాపూలే చిరస్మరణీయులు**
- **బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు**



**చట్టం భూపాలపల్లి ప్రతినిధి :** పీడిత ప్రజల బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి నిత్య స్ఫూర్తి ప్రదాత మహాత్మ జ్యోతిబాపూలే చిరస్మరణీయులని వారి ఆశయాల సాధనకు చైతన్యంతో సంఘటితమై పోరాటాలు నిర్వహించడమే వారికి నిజమైన నివాళులు అర్పించినట్లు కాగలదని బీసీ హక్కుల సాధన సమితిరాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. బీసీహక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వలబోజు వెంకన్న ఆధ్వర్యంలో వరంగల్ ములుగు రోడ్ వద్ద 198వ జయంతిని జ్యోతిబాపూలే విగ్రహానికి పూల మాలలువేసి ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెంకట్రాములు ప్రసంగిస్తూ సామాజికంగా ఆర్థికంగా అట్టడుగువర్గంలో జన్మించిన జ్యోతిభాపూలే తోటి మనుషులను పశువులకంటే హీనంగాచూసిన రోజులలో దళిత బహుజన వర్గాలకు మహిళలకు సామాజిక న్యాయం కోసం ఉద్యమించిన మహోన్నత వ్యక్తి పూలే అని కొనియాడారు. అంటరానితనానికి కుల వ్యవస్థకు బాల్య వివాహాలకు, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడి, అనేక అవమానాలు ఆటంకాలు ఎదురైనా శూద్రులకు మహిళలకు విద్య కోసం వారు చేసిన కృషి ఎనలేనిదన్నారు. అంతరాలు తొలగిపోవాలని మానవులంతా సమానమేనని, సమధర్మం, వ్యక్తి స్వేచ్ఛ కావాలని ధైర్యంగా నిస్వార్థంగా పోరాడిన గొప్ప సంఘ సంస్కర్త పూలే ఆశయమైన వివక్షతలు, దోపిడీలేని సమసమాజ నిర్మాణం కోసం ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ బలహీన వర్గాల వారంతా ఐక్యంగా పోరాడాలని వెంకట్రాములు పిలుపునిచ్చారు. బీసీహక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు వలభోజువెంకన్న, వరంగల్ మండల కార్యదర్శి మేడిదిఅశోక్, పులుగోటి రమణాచారి, నోములప్రదీప్, బచ్చలస్వప్న, పెరుమళ్ళ రాజేష్, సరిత, సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

# ఫ్రైడే కార్యక్రమంలో పాల్గొన్న DMO



**చట్టం చందూర్ :** నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గ పరిధిలోని PHC మోస్రా చందూర్ మండల కేంద్రంలో DMO డిస్టిక్ మెడికల్ ఆఫీసర్ ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా కుండల తయారీ ప్రాంతం పరిశీలించారు. పగిలిన కుండలు అన్ని నీటి నిలువలు ఉండకుండా చూసుకోవాలని యజమానికి తెలిపారు ఇక్కడ లభించిన అన్ని వంట పాత్రలు పరిశీలన చేసి మంచి ఆరోగ్యానికి ఈ పాత్రలు అన్ని వినియోగించు కోవాలని డిస్టిక్ మెడికల్ ఆఫీసర్ ఇక్కడే కొనుగోలు చేస్తూ ఇక నుండి ఇందులో వండిన పదార్థాలు బుజించటం జరగాలి అందరు కూడా తీసుకొని మీ అందరి ఆరోగ్యం కాపాడుకోని అందరు ఆరోగ్యంగా ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమం చందూర్ గ్రామ ప్రజలు PHC మోస్రా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ రవాణా పై ఉక్కు పాదం : సబ్ కలెక్టర్ కిరణ్మయి

**చట్టం బీర్కూర్:** బాన్సువాడ సబ్ కలెక్టర్ దొంగ్లి నుండి బిర్కూర్ వైపు వెళ్లుచుండగా బిర్కూర్ బ్రిడ్జి క్రింద నదిలో కుర్ల శివారులో రెండు ట్రాక్టర్ లలో ఇసుకను అక్రమంగా నింపుటకు ప్రయత్నిస్తుండగా హుటా హుటిన నదిలోకి చేరుకున్న సబ్ కలెక్టర్ వెంటనే జెసిబి యంత్రాన్ని తీసుకొచ్చి అక్రమ ఇసుక రవాణాకు ఉపయోగించే దారిని తొలగించారు, అక్రమ ఇసుక తరలిస్తున్న వాహనాలను వాటిని పట్టుకొనుటకు ప్రయత్నించగా వారు పారిపోయారు. అప్పుడు ఇసుక అక్రమ రవాణా కొరకు వాడుచున్న దారిని గమనించి నేడు తేది 11.04.2025 రోజున దొంగ్లీ,బీర్కూర్ మండలాల తహసీల్దార్ లు, సబ్ ఇన్స్ పెక్టర్ లు, రెవిన్యూ పోలీసు సిబ్బంది, సబ్ కలెక్టర్ సమక్షంలో జేసీబీ మెషిన్ ద్వారా ఇసుక అక్రమ రవాణా చేయు దారిని తొలిగించినారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టవలసిందిగా ఉన్నతాధికారులు ఆదేశించిన నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టినట్లు సబ్ కలెక్టర్ తెలియచేశారు. ఈ దారిని మళ్ళీ ఏర్పాటు చేసినా, ఇసుక అక్రమ రవాణా చేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని సబ్ కలెక్టర్ హెచ్చరించారు.

# బడిబాట ర్యాలీ




**చట్టం భూపాలపల్లి ప్రతినిధి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మలహర్ రావు మండలం రామారావు పల్లె పాఠశాల పరిధిలో బడిబాట నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి, లక్ష్మణ్ బాబు, తాడిచెర్ల కాంప్లెక్స్ హెచ్ఎం సిహెచ్ తిరుపతి ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు బడిబాట ర్యాలీ నిర్వహించారు. విద్యాశాఖ అధికారి లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం విద్యను బోధిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వము మధ్యాహ్న భోజన పాఠ్య పుస్తకములు యూనిఫామ్స్ అందజేస్తున్నారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ, ఉపాధ్యాయులు డి కవిత ఏం.కవిత, సీఆర్పీలు ఏ ఏ పి సి చైర్మన్ మీనా, విద్యార్థులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

CHATTAM NEWS
చట్టం
సంపూర్ణ స్వతంత్ర దినపత్రిక

# చలివేంద్రం ఏర్పాటు చేసిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**చట్టం మెదక్ ప్రతినిధి :** వచ్చే అర్జీదారులు, సందర్శకులు వేసవి తాపం నుంచి సేద తీరేందుకు వీలుగా కలెక్టరేట్ లోపల తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్(ట్రేసా) ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. ట్రేసా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని జిల్లా కలెక్టర్ శుక్రవారం ప్రారంభించారు. ట్రేసా ఆధ్వర్యంలో జిల్లాలో ఉన్న 21 తహసీల్దార్ కార్యాలయాల ఆవరణలో చలివేంద్రాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. చలివేంద్రాన్ని ప్రారంభించిన తర్వాత కలెక్టర్ స్వయంగా మంచినీళ్లు పలువురికి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ట్రేసా ఆధ్వర్యంలో జిల్లాలో ఉన్న 21 తహసీల్దార్ కార్యాలయాల ఆవరణలో సైతం చలివేంద్రాలను ఏర్పా చేస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్, మే నెలలో ఎండలు బాగా ఉంటాయి కావున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి ప్రయాణం చేసేటప్పుడు చల్లని నీరు చల్లటి జ్యూస్ తాగాలన్నారు మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఎండ వేడి చాలా ఉంటుంది ప్రజలు బయటికి రాకూడదు అత్యవసర పని ఉన్న సందర్భంలో మార్నింగ్ టైం లో పని చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మహేందర్ గౌడ్, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షులు తాటి నరసింహులు, కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ సిద్దు, సెక్రెటరీ నవీన్, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మెగా జాబ్ మేళాలో పాల్గొన్న కుడా ఛైర్మన్



**చట్టం / పరకాల :** వరంగల్ తూర్పు నియోజక వర్గ పరిధి లోని ఏం కే నాయుడు కన్వెన్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళా ను రాష్ట్ర మంత్రి కొండ సురేఖ, దనసరి అనసూయ (సీతక్క), పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట శాసన సభ్యులు కె.ఆర్.నాగరాజు తో కలిసి పాల్గొన్న వరంగల్ కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి . ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్లు డాక్టర్ సత్య శారద మరియు ప్రవీణ్య, బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే మరియు సంబందిత అధికారులు పాల్గొన్నారు.

## బస్టాండా పార్కింగ్ అడ్డానా?



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని పట్టణ నడిబొడ్డులో గల పాత బస్టాండ్ పార్కింగ్ అడ్డగా మారిపోయింది. ఆర్మూర్ పట్టణ చరిత్రలోనే పాత బస్టాండ్ ఒక వెలుగు వెలిగిన ఘనత కలదు. అటువంటి పాత బస్టాండ్ కు బస్సులు రాక ఒక కలగానే మిగిలిపోతుందా. గతంలో పాత బస్టాండ్ నుండి ప్రతి గ్రామానికి వెళ్లే బస్సులు ఇక్కడి ప్రజలను రవాణాకు తీసుకుపోయాయి. అటువంటి పాత బస్టాండ్ నేడు బస్సులు రాక పార్కింగ్ అడ్డగా మారిపోయిందని ప్రజలు అంటున్నారు. కార్లు, బైకులు పార్కింగ్ చేయడంతో వాటి చాటుమాటున కాలకృత్యాలు తీర్చుకుంటున్న జనాలు. ఆర్టిసి బస్సుల రవాణా పాత బస్టాండ్ ప్రాంతంలో పెరిగితే ఈ ప్రాంతంలో అన్ని రకాల బిజినెస్లు పెరిగి ఈ ప్రాంతం అభివృద్ధి చెందే అవకాశం ఉందని, ఆర్టీసీ అధికారులు ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని మళ్లీ పాత బస్టాండ్కు పూర్వ వైభవం తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

## బ్రిడ్జ్ నిర్మాణం, రేషన్ షాపుల కోసం తహసీల్దార్ కు వినతి



**చట్టం, బోథ్ :** నక్కల వాడ వద్ద నూతన బ్రిడ్జి నిర్మాణం.. రేషన్ షాపు ఏర్పాటు చేయాలి... నక్కల వాడ గ్రామపంచాయతీ పరిధిలోని నాలుగు గ్రామాలైన లక్ష్మీపూర్ రేండ్లపల్లి కొత్తపల్లి నక్కలవాడ గిరిజన గ్రామాల ప్రజలు రేషన్ దుకాణం లేక బోత్ మరియు మర్లపల్లి గ్రామాలకు వెళ్లి రేషన్ సరుకులు తీసుకువస్తున్నారు దీంతో వారిపై రవాణా చార్జీల భారం పడుతున్నది. ఒకరోజు సమయం వృధా అవుతున్నది .నక్కలవాడ వద్దగల పెద్దవాగు పై ఉన్న వంతెన కూలిపోయే స్థితిలో ఉన్నందున నూతన వంతెన నిర్మించాలని రవాణా సౌకర్యము వర్షాకాలంలో కూడా నిరాటంకంగా కొనసాగేలా చూడాలని బోథ్ తహసీల్దార్ కు బి ఆర్ ఎస్ పార్టీ తరపున కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నతాధికారులకు సమగ్ర నివేదిక అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఆత్మ చైర్మన్ మల్లెపూల సుభాష్, మాజీ గ్రంథాలయ డైరెక్టర్ కుంట వెంకటరమణ గౌడ్, బీసీ సెల్ మండల అధ్యక్షులు భీమ బుచ్చన్న, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మడావి భీమ్రావు, యూత్ అధ్యక్షులు మేడిచర్ల ప్రవీణ్, నాయకులు చిలుకూరు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## వార్డులో పర్యటించిన వినయ్ రెడ్డి



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని 29వ వార్డు కమల నెహ్రూ కాలనీలో శుక్రవారం రోజు కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బ్యావత్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా 29వ వార్డులో పర్యటించిన ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ప్రొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి. సందర్భంగా ఆయన కాలనీ వాసులతో మాట్లాడుతూ, కాలనీలో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయిస్తానన్నారు, కాలనీలో సిసి రోడ్లు, డ్రైనేజీలు, నీటి సమస్యను తొలగిస్తానని అన్నారు. ఫయ్యూమ్, సతీష్, లింబన్న, కాలనీ వాసులు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా జ్యోతిబాపూలే 198వ జయంతి వేడుకలు...



**(చట్టం ప్రతినిధి కామారెడ్డి):** జ్యోతిబాపూలే 198వ జయంతి వేడుక ను జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా జ్యోతిబాపూలే 198వ జయంతిని ఘనంగా కామరెడ్డి మున్సిపల్ ఆవరణంలో అడిషనల్ కలెక్టర్ అధ్యక్షతన జరిగిందనీ, ఇందులో బీసీ సంఘం ప్రతినిధులు ఎస్సీ, ఎస్టీ మైనారిటీ సంఘాల నాయకులు ప్రజలు విద్యార్థులు యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చి మహాత్మ జ్యోతిబాపూలే జయంతిని ఘనంగా జరుపుకున్నామన్నారు. ఇందులో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు నృత్య కార్యక్రమాలు కళాకారుల జానపదాలు పలువురు వక్తల వ్యాఖ్యానాలు యువకులను ఎంతో ఉర్రూతలూగించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్, జిల్లా గ్రంథాలయ కమిటీ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, ఆర్డిఓ మేడం, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాముని సుదర్శన్ నేత, జిల్లా అధ్యక్షుడు చింతల శంకర్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, జిల్లా మహిళా అధ్యక్షురాలు మంజుల, జిల్లా సోషల్ మీడియా ఇన్చార్జ్ రాజేందర్, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కూచి పెంటయ్య, టౌన్ ఉపాధ్యక్షుడు మహేందర్, ఎస్ ఎస్ నగర్ ఇన్చార్జ్ మామిడి రాజేష్, పుల్ల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్ గ్రామంలో ఐకేపీ మహిళ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం రోజు ప్రారంభించారు. యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తలారి రాకేష్, పాల్గొని మాట్లాడుతూ రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చి మంచి మద్దతు ధర పొందాలని సూచించారు. ముఖ్యంగా రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. సన్న వడ్లు కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాలకు ఇవ్వడం జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు, గ్రామ ప్రజలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## అరాచక పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- బాసర త్రిబుల్ ఐటీ వద్ద అసిస్టెంట్ ప్రొఫెసర్ల నిరసన
- సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే రామరావ్ పటేల్



**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రజలే గుణపాఠం చెప్తారని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. శుక్రవారం బాసర త్రిబుల్ ఐటీ ముందు తమను రెగ్యులరైజ్ చేయాలని ధర్నా చేస్తున్న కాంటాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు సంఘీభావం ప్రకటించి ఆయన మాట్లాడారు. జీవో 21 వల్ల సంవత్సరాల తరబడి పని చేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఉద్యోగ భద్రతకు ముప్పు వాటిల్లుతుందన్నారు.. తక్షణమే జీవను ఉపసంహరించుకోవాలని లేనిపక్షంలో బిజెపి ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలను తీవ్రతరం చేస్తామన్నారు. రాష్ట్రంలో 13 యూనివర్సిటీలో 900 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారని, అందులో 200 మంది మహిళా ప్రొఫెసర్లు ఉన్నారన్నారు. న్యాయం చేయాలని ముఖ్యమంత్రి వద్దకు వెళితే, వారందరినీ అరెస్ట్ చేసి 13 పోలీస్ స్టేషన్లో దినమంతా నిర్బంధించడం ఏంటని మండిపడ్డారు. ఎన్నికల్లో రెగ్యులరైజ్ చేస్తానని, ప్రొఫెసర్లకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి మాట తప్పడం సరికాదన్నారు. ఇచ్చిన వాగ్దానం మేరకు వారిని తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వారికి మద్దతు ఇస్తూ రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

## మహాత్మ జ్యోతిబాపూలే జయంతి వేడుకలు...



**చట్టం కోరుట్ల :** కోరుట్ల పట్టణ జువ్వాడి కృష్ణారావు స్వగృహం జువ్వాడి భవన్ లో శుక్రవారం మహాత్మ జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన కోరుట్ల మండల పట్టణ కాంగ్రెస్ పార్టీ నేతలు ఈసందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ సామాజిక సంస్కర్తల దార్శనికుడు సామాజిక న్యాయ పితామహుడు బలహీన వర్గాల చైతన్య స్ఫూర్తి దాత మహాత్మా జ్యోతిరావు పూలే సామాజిక సమానత్వం మహిళా సాధికారత విద్యను పెంపొందించడం కోసం అవిశ్రాంతంగా కృషి చేశారన్నారు. 19వ శతాబ్దంలో జ్యోతిభాపూలే ప్రారంభించిన అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేయడం అనే మహోన్నత ఆశయాన్ని 20వ శతాబ్దంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సైతం స్ఫూర్తిగా తీసుకొని కొనసాగించారు. చట్టపరంగా ఎలాంటి వివక్షత తారతమ్యాలు లేకుండా ప్రజలందరికీ సామాజిక న్యాయం హక్కులు దక్కాలని పూలే జీవితాంతం పరితపించారని సంఘసంస్కర్త సామాజిక తత్వవేత్త ఉద్యమకారుడు మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను కోరుట్ల పట్టణ జువ్వాడి భవన్ లో నిర్వహించడం జరిగిందన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన దీన జన బాంధవుడు అని మహిళా విద్యాభివృద్ధికి మార్గదర్శి సమసమాజ స్థాపనలో భావితరాలకు నిత్య స్ఫూర్తి ప్రదాతగా నిల్చాడన్నారు. సమాజంలో కులపరమైన వివక్షను అన్యాయాలను రూపుమాపడానికి తన జీవితాన్ని ధారపోషణ మహాత్ముడు అని కొనియాడారు ఆయన ఆలోచనలను ఆశలను స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ మ్యాకల నర్సయ్య ఎంబేరి సత్యనారాయణ జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు సోగ్రాభి ఏ ఆర్ అక్బర్, దశరథం, చిట్యాల లక్ష్మినారాయణ, నేమూరి భూమయ్య, ముల్క ప్రసాద్, సదుల వెంకటస్వామి, అల్లం రాజమౌళి, శేఖర్, యూట్యూబర్ రాజు, కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్



**చట్టం మెదక్ ప్రతినిధి :** మెదక్ మండలం శివాయపల్లి గ్రామంలోని నెలకొల్పిన ప్యాక్స్ కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ రాహుల్ రాజ్ శుక్రవారం పరిశీలించారు. రైతుల నుండి ఇప్పటివరకు సేకరించిన ధాన్యం నిల్వల గురించి కేంద్రాల నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతుల సౌకర్యార్థం కేంద్రంలో అందుబాటులో ఉంచిన సదుపాయాలను పరిశీలించారు. కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని ఆరా తీశారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా ఎక్కువ సంఖ్యలో టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి స్థాయి లక్ష్యానికి అనుగుణంగా సాఫీగా సాగేలా కృషి చేయాలని అన్నారు. రైతులు ధాన్యం తెచ్చిన వెంటనే తూకం వేయించి, లారీలలో లోడ్ చేసి నిర్దేశిత రైస్ మిల్లులకు పంపించాలని, మిల్లుల వద్ద ధాన్యం అన్ లోడింగ్ వెంటదివెంట జరిగేలా పర్యవేక్షణ జరపాలన్నారు. కలెక్టర్ వెంట ప్యాక్స్ కొనుగోలు కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## జ్యోతిబా పులేకు నివాళులు



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని శాస్త్రి నగర్ లో గల సిపిఎం పార్టీ కార్యాలయంలో మండల కమిటీ ఆధ్వర్యంలో భారతదేశ మొట్టమొదటి సంఘసంస్కర్త స్వాతంత్ర సమరయోధుడు సామాజిక విప్లవకారుడు దళిత బహుజనుల వైతాళికుడు మహాత్మ జ్యోతిబా పులే 198 జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి కూతాడి ఎల్లయ్య మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే మానవ హక్కుల గురించి ఇతర సామాజిక సమస్యల గురించి స్త్రీలను చైతన్య పరచడానికి 1852లో మహిళా సేవా మండల్ను స్థాపించారు. స్త్రీల సాధికారత కోసం కృషి చేశారు. 1873లో భార్యతో కలిసి సత్యశోధక్ సమాజం ప్రారంభించి బాల్య వివాహాలను, మూఢనమ్మకాలకు సతీసహగమనానికి వ్యతిరేకంగా వితంతువుల పునర్వివాహాలకు కోసం అసమాన బ్రాహ్మణి వ్యవస్థకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమం నడిపారన్నారు. ఈ కార్యక్రమంలో పల్లపు వెంకటేష్, సీపీఎం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



**చట్టం, కుంటాల :** కుంటాల మండలం పరిధి లోని అంబుగామ్ గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపార వేత్త సుదర్శన్ పటేల్ ను శుక్రవారం కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబ సభ్యుని ఇంటికి నేరుగా వెళ్లి పరామర్శించారు. అంతకు ముందు కొన్ని విషయాలను అడిగి తెలుసుకుని వారికి మనో ధైర్యాన్ని అందించి మీ వెంట మే ముంటామంటూ ఆత్మస్థైర్యాన్ని అందించారు ఇంట్లో ఒక మనిషి కోల్పోయినప్పుడు ఆ బాధ అందరికీ ఉంటుందని మన అందరిని చూసుకునేవాడు ఆ భగవంతుడు ఉన్నాడని వారికి ధైర్యాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పి చెర్మెన్ జుట్టు అశోక్, మాజీ ఎంపిపి బోజారాం పటేల్ స్థానిక కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు.

## ఉషోదయ పాఠశాలలో మహాత్మా జ్యోతిభపులే జయంతి



**చట్టం, బోథ్:** సోనాల మండలంలోని ఉషోదయ పాఠశాలలో మహాత్మా జ్యోతి బాపూలే ఫోటోకు పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ప్రధానోపాధ్యాయులు ఎ.గంగాధర్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిభపులే అని పిలువబడే జ్యోతి రావు గోవింద రావు పూలే ఒక ప్రముఖ భారతీయ సామజిక సంస్కార్త, కార్యకర్త 1827లో జన్మించిన అయన కుల వివక్షకు, వ్యతిరేకంగా పోరాడటానికి మరియు అణగారిన వర్గాల హక్కుల కోసం ముఖ్యంగా మహిళల కోసం వదించడనికి తన జీవితాన్ని అంకితం చేసాడని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు KV స్వామి, B సంజయ్, G భూషణ్, D నర్సయ్య, వెంకట రమణ, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన బార్ అసోసియేషన్ ఎన్నికలు



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని కోర్టు ప్రాంగణంలో శుక్రవారం రోజు 2025 26వ సంవత్సరానికి గాను ఆర్మూర్ న్యాయవాదుల బార్ అసోసియేషన్ ఎన్నికలు ముగిసాయి. ఎన్నికలలో అధ్యక్షులుగా జక్కుల శ్రీధర్ 18 ఓట్ల మెజారిటీతో, ఉపాధ్యక్షులు గా ఆనంద్ 3 ఓట్ల మెజార్టీతో, ప్రధాన కార్యదర్శిగా జెస్సు అనిల్ కుమార్ 9 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ కమిటీలో సంయుక్త కార్యదర్శిగా మద్దుల గంగారం, కోశాధికారిగా గజ్జల చైతన్య, గ్రంథాల కార్యదర్శిగా కుందారం శ్రావణ్ లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు జక్కుల శ్రీధర్ మాట్లాడుతూ, ఈ ఎన్నికల విజయానికి ప్రత్యక్షంగా పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్క న్యాయవాదికి ధన్యవాదాలు తెలియజేశారు. మాపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించారు అదే నమ్మకంతో ఈ న్యాయవాదుల సమస్యల పైన సమస్యల పరిష్కారానికై కృషి చేస్తామన్నారు. బార్ అభివృద్ధికై న్యాయవాదుల సలహాలు, సూచనలు తీసుకొని ముందుకు వెళ్తామన్నారు. మా కమిటీ ఓ జట్టుగా సమిష్టిగా పనిచేసి ఆదర్శవంతంగా ఉండే విధంగా పూర్తి తరహాలో కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు



**చట్టం రామగుండం:** సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి, వారి విద్యాభివృద్ధి కోసం కృషిచేసిన గొప్ప సంఘ సంస్కర్త, మానవతావాది మహాత్మా జ్యోతిబా పూలే జయంతి రామగుండం బీజేపీ ఆఫీస్ లో బీజేపీ నాయకులచేత పుష్ప మాల వేసి వారికి ఘన నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా మహిళ మోర్చా నాయకురాలు, Onenation oneelection జిల్లా కన్వీనర్ సోమారపు లావణ్య మాటాడుతూ జ్యోతిరావుపూలే గొప్ప సామజిక సంస్కార్త, బడుగు బాలహినా వర్గాల నాయకుడు.,మహిళ సాధికారాతకు నిరంతరం పాటుపడిన గొప్ప వ్యక్తి వారి జీవిత త్యాగాలను గుర్తు చేసుకొని, వారి కి నివాళ్లు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు స్టేట్ కౌన్సిలింగ్ మెంబెర్ సుల్వ లక్ష్మినారాయణ, స్టేట్ sc మోర్చా జనరల్ సెక్రటరీ కాసిపేట శివాజీ, సీనియర్ నాయకులు మహావాది రామన్న, బీజేపీ సీనియర్ నాయకులు పెద్దపల్లి రవీందర్, మాజీ మండలం అదేక్ష్యలు నవీన్ గౌడ్, చుక్కల రాములు, కమల్ గౌడ్, స్రవణ్, మేడి రాజు తదితరులు పాలుగోన్నారు.

## గొప్ప సంఘ సంస్కర్త, మహాత్మా జ్యోతిబా పూలే



**చట్టం రామగుండం :** సామాజిక అసమానతల మీద అలుపెరగని పోరాటం చేసి, అణగారిన వర్గాల విద్యాభివృద్ధి కోసం కృషిచేసిన గొప్ప సంఘ సంస్కర్త, మహాత్మా జ్యోతిబా పూలే అని రామగుండం మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. పూలే జయంతి సందర్భంగా స్థానిక రాజేష్ దియేటర్ సమీపంలోని పూలే విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా జ్యోతిబా పూలే, మహిళలు, మైనారిటీల విద్య కోసం కృషి చేసిన సామాజిక కార్యకర్త అన్నారు. సమాజంలోని అణగారిన వర్గాల బాలికల కోసం ఆయన మొదటి పాఠశాలను ప్రారంభించారు. కుల వ్యవస్థను వ్యతిరేకించారని చెప్పారు. వారి ఆశయాల కోసం ముందుకు తీసుకువెళ్లాలన్నారు. రాష్ట్ర మాజీ పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అదేశాల మేరకు మహత్మ జ్యోతిబా పులే విగ్రహాన్ని ఎర్పాటు చేయడం జరిగిందని కేటీఆర్ ఆధ్వర్యంలో ఆవిష్కరణ చేయడం జరిగిందని గుర్తు చేశారు. జ్యోతిరావు పులే జయంతి వేడుకలు రామగుండం నియోజకవర్గంలో కన్నుల పండుగగా నిర్వహించుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నడిపెల్లి మురళీధర్ రావు, మాజీ కార్పోరేటర్ కుమ్మరి శ్రీనివాస్, పెంట రాజేష్, గోపు అయిలయ్య, అచ్చే వేణు, బుర్ర వెంకన్న, సట్టు శ్రీనివాస్, ఆర్శనపల్లి శ్రీనివాస్, రామరాజు, కోడి రామకృష్ణ, అవునూరి వెంకటేష్, కిరణ్ జీ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by SIRIGADA PRASAD and Printed at INDUR OFFSET PRINTERS, Opposite Cheer Hanuman Temple, Weekly Bazar, Nizamabad District,Telangana 503001., and Published at: H.No. 3-3-486/2, Gayathrinagar, Varni road, Nizamabad District, Telangana - 503001.,Editor: SIRIGADA PRASAD. RNI.No. TELTEL/2010/32350. Cell ;9948884497. prasadsirigada27@gmail.com